

రేపటి నుంచి టెట్

రాజమహేంద్రవరం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(ఏపీ టెట్ అక్టోబర్ 2025) పేపర్ 1,2 ఈనెల 10 నుంచి 21 వరకూ నిర్వహిస్తున్నారని డీఈవో వాసుదేవరావు తెలిపారు. రాజమహేంద్రవరంలోని రాజీవ్ గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌లో సెషన్-1 ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకూ, సెషన్-2 మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్ వెనుక ముద్రించిన సూచనలు తప్పకుండా పాటించాలని చెప్పారు.



జాప్యమేలా..

- టీడీపీ జిల్లా కమిటీల నియామకం ఎప్పుడో..
- త్రిసభ్య కమిటీ నివేదిక ఇచ్చినా.. ఇప్పటికీ ఇంతే
- జాప్యంపై పార్టీ అధినేత చంద్రబాబు అసంతృప్తి
- శనివారంలోపు స్పష్టత వచ్చే అవకాశం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ఎప్పుడో ముగిసినా, జిల్లా కమిటీ నియామకం మాత్రం ఇంకా జాప్యం అవుతోంది. రెండు రోజుల కిందట అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడు పార్టీ నేతల సమావేశంలో జిల్లా కమిటీల నియామకం జాప్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం. ఈ శనివారంలోపు పేర్లలో స్పష్టత రావాలని కూడా ఆదేశించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈవారం చివరిలో గానీ, వచ్చేవారంలోగానీ జిల్లా కమిటీని ప్రకటించే అవకాశం ఉంది. కానీ ఇంకో సమాచారం కూడా ఉంది. ఈనెల 17న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కొందరు నేతలతో సమావేశం కానున్నట్టు తెలిసిందే. అదే నిజమైతే అప్పటివరకూ కమిటీ ప్రకటన ఉండకపోవచ్చు. కొన్ని వారాల కిందట మంత్రులు, ఇతర ముఖ్య నేతలతో త్రిసభ్య కమిటీలను జిల్లాలకు పంపి, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ముఖ్యనేతల అభిప్రాయాలు కూడా సేకరించారు. ముగ్గురు పేర్లు ఫైనల్ చేసిన ఈ కమిటీ నివేదిక కూడా ఇచ్చింది. కానీ అధ్యక్షుడి విషయంలో ఏకాభిప్రాయం కుదిరినా, జిల్లా కమిటీల్లో ఇతర నేతల విషయానికి సంబంధించి కొందరి పేర్ల విషయంలో ఏకాభిప్రాయం లేనట్టు సమాచారం. వచ్చే శనివారంలోపు పేర్ల విషయంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

కొత్త జిల్లాలతో మార్పులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విడిపోయిన తర్వాత తూర్పుగోదావరి, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాలు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇటీవల కొద్దిగా మార్పు కూడా జరిగింది. తూర్పుగోదావరి జిల్లాలో మండపేట నియోజకవర్గం కూడా విలీనం చేశారు. ఈనెలాఖరిలోపు అధికారిక ప్రకటన కూడా రానుంది. అందువల్ల పార్లమెంట్ స్థాయిని దాటి జిల్లాలు ఉండే పరిస్థితి ఉంది. కొత్తగా రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా కూడా ఏర్పడనుంది. అందువల్ల ప్రస్తుతం నాలుగు జిల్లాల కమిటీలను నియమించే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ చాలావరకూ కుటుంబ సాధికార సారథులు, బూత్, గ్రామ కమిటీలు, క్లస్టర్, యూనిట్, మండల, పట్టణ, డివిజన్ కమిటీలు, అనుబంధ కమిటీలు, నియోజకవర్గ అనుబంధ కమిటీలు నియామకం పూర్తయింది. వాస్తవానికి మేనెల చివరలో జరిగే తెలుగుదేశం పార్టీ మహానాడుకు ముందే ఈ కమిటీ నియామకం పూర్తికావాలి. కానీ ఆలస్యం అయింది. తర్వాత ఇవన్నీ పూర్తిచేశారు. ఇంతవరకూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడు జిల్లాలకు ముగ్గురు అధ్యక్షులను నియమించారు. ఇవాళ పోలవరం జిల్లా కమిటీ కూడా నియమించే అవకాశం ఉంది. ఇక తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి కేఎస్ జవహర్‌కు రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ పదవి రావడంతో ఆయన జిల్లా అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవడంతో అది ఖాళీ అయింది. దీంతో ఇక్కడ కొత్త అధ్యక్షుడిని నియమించవలసి ఉంది. జిల్లా నుంచి మూడు పేర్లు పరిశీలన చేసిన నివేదిక ఇచ్చారు. కాకినాడ జిల్లాకు జ్యోతుల నవీన్ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. అక్కడ కూడా కమిటీ మూడు పేర్లతో నివేదిక ఇచ్చింది. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షురాలిగా రెడ్డి అనంతలక్ష్మి వ్యవహరిస్తున్నారు. అక్కడ పరిస్థితి కూడా అంతే. గతంలో ఇచ్చినట్టు ఒకరు ఓసీ, ఒకరు బీసీ, ఒకరు ఎస్సీకి పదవి ఇస్తారు. లేదా రాష్ట్రం యూనిట్‌గా తీసుకుని ఇంకెవరికైనా అధ్యక్ష పగ్గాలు కట్టబెడతారా అనేది ఇంకా స్పష్టత లేదు. పోలవరం జిల్లాకు కమిటీని నియమిస్తే మాత్రం కచ్చితంగా ఎస్టీ వర్గం నుంచే నియమించే అవకాశం ఉంది. ఎస్టీని నియమిస్తే అక్కడి ఎమ్మెల్యేకి మధ్య ఆధిపత్య పోరు మొదలవుతుందేమోనని పార్టీ ఆలోచిస్తే, ఇతర వర్గాలకు కూడా పదవి కట్టబెట్టే అవకాశం లేకపోలేదు. మొత్తానికి జిల్లా కమిటీలు కూడా ప్రకటిస్తే టీడీపీలో మరింత జోష్ పెరుగుతుంది.





నన్నయ విశ్వవిద్యాలయంలో నన్నయ విగ్రహానికి పూలమాల వేస్తున్న వెంకయ్య నాయుడు.. సభలో పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

అమ్మ.. అనే పిలుపులో మాధుర్యం మమ్మీలో ఉండదు!

- సూర్యారాయాంధ్ర నిఘంటువు పునర్ముద్రణ చేస్తామని పవన్ ప్రకటించడం హర్షణీయం
- 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం'పై కార్యశాల ప్రారంభ సభలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

6



బోగస్‌లే.. కదిలేదిలే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకును మొండిబాకీలు వెన్నాడుతున్నాయి. ఏళ్లకు ఏళ్లు వసూలవక చుక్కలు చూపిస్తున్నాయి. అసలు వస్తాయోరావోనన్నట్టు ఏడిపిస్తున్నాయి. అయితే అత్యధిక బాకీలు బోగస్‌వే ఉండడంతో అధికారులు వీటి వసూలుపై ఆశలు వదిలేసుకుంటున్నారు. చాలావరకు రికార్డులు కంప్యూటరీకరణ కాకపోవడంతో కాగితాలపై రుణాలు చూపించి బోగస్ వ్యక్తులు అధికంగా డీసీసీబీ డబ్బును మింగేశారు. ప్రధానంగా గత వైసీపీ హయాంలో దొంగ రుణాలు భారీగా నమోదయ్యాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చే సమయానికి డీసీసీబీ మొండి బాకీలు రూ.200 కోట్ల వరకు ఉంటే, వైసీపీ గద్దె దిగే సమయానికి మొండిబాకీలు రూ.980 కోట్లకు చేరాయంటే ఏస్థాయిలో డీసీసీబీ డబ్బును అప్పటి అధికార పార్టీ నేతలు దిగమింగేశారో అర్థం చేసుకోవచ్చు.

- ఉమ్మడి తూర్పుగోదావరిలో రూ.980 కోట్లకు చేరిన డీసీసీబీ మొండిబాకీలు
- వసూలు చేయడానికి అధికారుల నానా తంటాలు
- వీటిలో బినామీ రుణాలే అధికం కావడంతో ఏంపాలుపోని పరిస్థితి
- 2019 నాటికి డీసీసీబీ బాకీలు రూ.200 కోట్లే.. వైసీపీ వచ్చాక రూ.980 కోట్లకు
- మార్చి సమీపిస్తుండడంతో తొమ్మిది బృందాలతో వసూళ్లకు ప్రణాళిక

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ కేంద్రంగా పనిచేసే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకును మొండిబాకీలు వెన్నాడుతున్నాయి. మూడేళ్లకుపైగా రూ.980 కోట్ల రుణాలు వసూలవక ఎన్‌పీఏలుగా మారాయి. వాస్తవానికి ఏదైనా బ్యాంకు రుణం మంజూరు చేయాలంటే అన్ని రకాల పత్రాలు తీసుకునే అప్పు మంజూరు చేస్తాయి. ఆనక వసూలవకపోతే ఆస్తులు వేలం వేసయినా డబ్బు రాబట్టుకుంటాయి. కానీ డీసీసీబీ రూటే వేరు. అన్నదాతలకు ఈ బ్యాంకు బ్రాంచ్‌ల ద్వారా వ్యవసాయానికి సంబంధించి స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేస్తుంటుంది. అయితే అనేకమంది రైతులు తమ భూమి పత్రాలు చూపించి లక్షల్లో మాత్రమే డీసీసీబీ బ్రాంచ్‌ల్లో రుణాలు తీసుకుంటారు. వీరి విషయంలో అధికారులు సవాలక్ష నిబంధనలు అమలుచేస్తారు. కానీ పలుకుబడి కలిగిన రాజకీయ నేతల విషయంలో మాత్రం వారు సూచించిన వ్యక్తుల విషయంలో పెద్దగా నిబంధనలు పాటించకుండా చూసీచూడనట్టు వ్యవహరిస్తారు. ఇక్కడే డీసీసీబీ డబ్బు దొంగరుణాల ద్వారా బయట వ్యక్తుల పరమవుతోంది. ప్రధానంగా పలు బ్రాంచ్‌ల్లో సిబ్బంది అక్రమార్కులతో చేతులు కలిపి బోగస్ రుణాలు జారీచేసి కోట్లకుకోట్లు గడచిన కొన్నేళ్లలో స్వాహా చేసేశారు. దొంగ పత్రాలు చూపించి, లేని భూములను రికార్డుల్లో చూపించి కోట్లకుకోట్లు రుణాలు మంజూరు చేసి తలాకొంచెం పంచుకు తినేశారు. ప్రధానంగా కిర్లంపూడి సొసైటీలో రూ.104 కోట్ల అవినీతి ఈ ఏడాది బట్టబయలైంది. రాజకీయ ప్రమేయంతో గత కొన్నేళ్లుగా మూలనపడ్డ విచారణను కూటమి ప్రభుత్వం రాగానే వేగం పుంజుకుంది. ఈ నేపథ్యంలో పెద్దాపురం డివిజనల్ సహకార అధికారి పద్మ విచారణ జరిపి ఈ ఏడాది జనవరిలో జిల్లా సహకార అధికారికి పూర్తిస్థాయి నివేదిక అందించారు. ఇందులో సొసైటీ సీఈవోలు, మేనేజర్లు, సూపర్‌వైజర్లు అంతా కలిపి ఈ అవినీతికి పాల్పడ్డారని నివేదికలో గుర్తించారు. అలాగే ఏలేశ్వరం సొసైటీ పరిధిలోను ఇలాగే బోగస్ రుణాలు మంజూరు చేశారు. బ్యాంకు కాగితాలపై ఉన్న రుణం తీసుకున్న వ్యక్తుల పేర్ల ఆచూకీ కూడా కనిపించడం లేదు. ఇలా ఎక్కడికక్కడ బ్యాంకు డబ్బును అక్రమార్కులు కాజేశారు. డీసీసీబీ బ్రాంచ్‌ల్లో రికార్డులు కంప్యూటరీకరణ కాకపోవడాన్ని అడ్డంపెట్టుకుని వైసీపీ గత అయిదేళ్ల పాలనలో అడ్డగోలుగా మింగేశారు. మరో మూడు నెలల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో మొండిబాకీల లెక్కలు తేల్చడానికి కసరత్తు ప్రారంభించిన అధికారులు ఈనెల 3 నాటికి ఉమ్మడి జిల్లాలో బ్రాంచ్‌ల వారీగా మొండిబాకీలు లెక్కలు తేల్చాగా కళ్లుబైర్లు కమ్మే అంకెలు తేలాయి. ఉమ్మడి జిల్లాలోని 53 డీసీసీబీ బ్రాంచ్‌ల్లో కలిపి ఎన్‌పీఏ బాకీలు రూ.980.72 కోట్లు తేల్చారు. ఇందులో అత్యధికంగా ప్రత్తిపాడు బ్రాంచ్‌లో రూ.332 కోట్లు బాకీ తేలింది. ఇవన్నీ మూడు నుంచి ఐదేళ్ల మధ్య ఇచ్చిన బాకీలే ఉన్నట్టు గుర్తించారు. వాస్తవానికి రూ.332 కోట్ల బాకీలకు సంబంధించి రుణం తీసుకున్న వ్యక్తులు డబ్బుల క్రమం తప్పకుండా చెల్లించకపోతే అధికారులు అప్రమత్తం కావాలి. తక్షణం రుణ వసూలుకు సంబంధించి ఆస్తుల వేలం వరకు వెళ్లాలి. కానీ ఇదేదీ జరగలేదు. అలాగే ఏలేశ్వరం బ్రాంచ్‌లో రూ.173 కోట్లు మొండి బాకీగా తేలింది. దీనిపై విచారణకు అడుగులు పడగా, తదుపరి విచారణ లేకుండా కొందరు అడ్డుకున్నారు. ఈ బాకీల్లో 80 శాతానికిపైగా బోగస్ రుణాలే. జగ్గంపేట బ్రాంచ్‌లో రూ.72కోట్లు, అన్నవరం రూ.45.53 కోట్లు, గోకవరం రూ.18కోట్లు, మండపేట రూ.12.29 కోట్లు చొప్పున పేరుకుపోయాయి. ఇవన్నీ దాదాపుగా గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసినవే ఉన్నాయి. సాధారణంగా నిజమైన రైతులు రుణాలు తీసుకుంటే ఎంత కష్టమైనా తిరిగి చెల్లిస్తారు. ఎన్నేళ్లయినా వసూలవడం లేదంటేనే తిరకాసు ఉన్నట్టు. మరోపక్క మొండిబాకీలు ఆలమూరు బ్రాంచ్‌లో రూ.3.74 కోట్లు, అల్లవరం రూ.2.24 కోట్లు, అమలాపురం రూ.2.91 కోట్లు, అంబాజీపేట రూ.1.38 కోట్లు, అన్నవరం రూ.45.53 కోట్లు, ఆత్రేయపురం రూ.6.86 కోట్లు, దానవాయిపేట రూ.4.78 కోట్లు, ద్రాక్షారామ రూ.7.89 కోట్లు, గండేపల్లి రూ.22.56 కోట్లు, గోకవరం రూ.18.91కోట్లు, గొల్లపాలెం రూ.6.23 కోట్లు, కె.గంగవరం రూ.2.59 కోట్లు, కడియం రూ.2.94 కోట్లు, కరప రూ.3.01 కోట్లు, కాట్రేనికోన రూ.6.70 కోట్లు, కోరుకొండ రూ.8.74కోట్లు, మలికిపురం రూ.2.66 కోట్లు, మామిడికుదురు రూ.2.81 కోట్లు, మండపేట రూ.12.29 కోట్లు, ముమ్మిడివరం రూ.4.96కోట్లు, నాగమల్లితోట రూ.3.94కోట్లు, పి.గన్నవరం రూ.3.13కోట్లు, పెద్దాపురం రూ.43.97 కోట్లు, పిఠాపురం రూ.23.32 కోట్లు, రఘుదేవపురం రూ.37.97 కోట్లు, రాజమహేంద్రవరం రూ.6.48కోట్లు, రాజానగరం రూ.11.27 కోట్లు, రంపచోడవరం రూ.16.14 కోట్లు, రంగంపేట రూ.10.98 కోట్లు, రాయవరం రూ.11.40కోట్లు, సామర్లకోట రూ.5.18 కోట్లు, తుని రూ.16.18కోట్లు, యు.కొత్తపల్లి రూ.9.95 కోట్లు మొండిబాకీలుగా తేల్చారు. వీటి వసూలుకు తాజాగా 9బృందాలను ఏర్పాటుచేశారు.



కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 213 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 213 అర్జీలు ప్రజల నుంచి స్వీకరించామని కలెక్టర్ కీర్తి చేకూరి వెల్లడించారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ రెవెన్యూ, సర్వే సంబంధిత అర్జీలు అత్యధికంగా వచ్చాయన్నారు. గ్రీవెన్స్‌లో అందిన అర్జీలను శాఖాధిపతులు పర్యవేక్షణలో పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని.. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఆయా హాస్టళ్లను ప్రత్యక్షంగా పరిశీలించి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆహార అండ్ పౌరసరఫరాలు, పోలీసుశాఖలకు చెందిన అర్జీలు ఎక్కువగా వస్తున్నట్టు తెలిపారు. జేసీ వై.మేఘాస్వరూప్, డీఆర్వో టి.సీతారామమూర్తి, ఎస్డీసీ ఎస్.భాస్కరరెడ్డి, పి.భాగ్యలక్ష్మి, సీపీవో జేడీ ఎల్.అప్పలకొండ, డీఎస్పీ విద్య పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 32 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 32 ఫిర్యాదులను ఎస్పీ నరసింహ కిషోర్ స్వీకరించారు. చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.



పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

బాల్య వివాహాల నిర్మూలన సమాజం బాధ్యత : కలెక్టర్

రాజమహేంద్రవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలన బాధ్యత సమాజంపై ఉందని, ఆ దిశగా ముందుకు రావాలని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. 'బాల్యం చదువు-తగిన వయసు తర్వాతే పెళ్లి' అనే సందేశంతో అవగాహన కార్యక్రమాలు ప్రారంభించామని చెప్పారు. సోమవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై పోస్టర్‌ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహ ముక్త్ భారత్ 100 రోజుల ప్రచార కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో బాల్య వివాహాల నివారణపై సమగ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇవి మార్చి 8 వరకూ కొనసాగుతాయన్నారు. ఈ సామాజిక రుగ్మతను రూపుమాపడంలో ప్రతి కుటుంబం, గ్రామం, పాఠశాల.. కలిసి రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో గ్రామ/వార్డు, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో బాల్య వివాహ నిరోధ కమిటీలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. రెవెన్యూ, విద్య, పోలీసు, ఐసీ డీఎస్ విభాగాలతో కలిపి మొత్తం 11 మంది ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు సమాచారం ఉంటే 1098, 100, 112 టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. జేసీ, డీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

తోటల పెంపకానికి 35 శాతం సబ్సిడీ : కలెక్టర్

రాజమహేంద్రవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : హార్టీకల్చర్ పంటల ప్రోత్సాహం కింద 35శాతం సబ్సిడీ ఉందని, విలువ ఆధారిత పంటలతోనే రైతులకు ఆదాయం ఎక్కువ వస్తుందని, రైతులు సంప్రదాయ పంటలతోపాటు అనుబంధ పంటల సాగుపై కూడా దృష్టిపెట్టాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంకాలం జాయింట్ కలెక్టర్ వై.మేఘాస్వరూప్ హార్టికల్చర్, వ్యవసాయ అధికార్లతో కలసి హార్టికల్చర్ రైతులతో సమీక్షించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ సీజనల్ డిమాండ్, స్థానిక వినియోగ అవసరాల ప్రకారం సాగు చేస్తే రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్నారు. హార్టికల్చర్ సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని, నాణ్యమైన ఫలాలు, కూరగాయలు సరఫరా చేస్తే మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని, రైతులు సృజనాత్మకంగా సాగు చేయాలన్నారు. రైతుల అభిప్రాయాలు, ఎదరవుతున్న ఇబ్బందులు, పాజిటివ్, నెగిటివ్ అంశాల మీద నేరుగా ఫీడ్‌బ్యాక్ సేకరించి, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే వ్యూహాలు అమలుచేయాలన్నారు. మిషన్ ఇంటిగ్రేటెడ్ ఇన్ హార్టికల్చర్ (ఎంఐడీహెచ్) పథకం కింద 35 శాతం సబ్సిడీ పొందవచ్చన్నారు. తోటల పెంపకం, పండ్లు, కూరగాయలు, సుగంధ, ఔషధ మొక్కల సాగు, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం, నర్సరీ స్థాపన, కోల్డ్ స్టోరేజ్ సదుపాయాలు పొందవచ్చన్నారు. జిల్లా హార్టికల్చర్ అధికారి ఎన్. మల్లికార్జునరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీవనిధర్ రామన్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం నాకు సెకండ్ హోమ్



- గోదావరి జిల్లాల ప్రజల ఆదరణ, ఆప్యాయతలు ఎనలేనివి
- ప్రస్తుతం ఏ రాజకీయ పార్టీలోను లేను
- నాకు ప్రేరణ మా ఆంటీ విజయనిర్మల
- 'ఆంధ్రజ్యోతి'తో ఇంటర్వ్యూలో సహజనటి జయసుధ

6

పెట్టుబడి అవకాశాల వినియోగం కోసం జిల్లా అభివృద్ధికి నివేదిక : కీర్తి

రాజమహేంద్రవరం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం అభివృద్ధి ప్రాంతం(వీఈఆర్) అభివృద్ధి దిశగా ప్రభుత్వం ఆర్థిక మాస్టర్ ప్లాన్‌ను అమలుచేయనుందని, అందులో భాగంగా జిల్లా స్థాయి శాఖలు తక్షణం అనుసంధాన చర్యలుచేపట్టాలని, పెట్టుబడి అవకాశాలకోసం జిల్లా అభివృద్ధికి నివేదిక సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. అమరావతి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తర్వాత ఆమె స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా అధికార్లకు ఆదేశాలు ఇచ్చారు. పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, వ్యవసాయాధారిత ప్రాసెసింగ్ యూనిట్లు, ఉపాధి అవకాశాల పెంపు తదితర వాటిపై దృష్టి పెట్టాలన్నారు. పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్ సౌకర్యాలు, ఐటీ, డేటా సెంటర్ల అవకాశం, పర్యాటక అభివృద్ధి వంటి అంశాలకు సంబంధించి జిల్లాకు అనుకూలంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో లభించే పెట్టుబడి అవకాశాలను సమగ్రంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ మేఘాస్వరూప్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీవనిధర్ రామన్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు, జిల్లా పరిశ్రమల ప్రమోషన్ అధికారి వై.టి ప్రకాశ్‌కుమార్, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎన్.మల్లికార్జునరావు హాజరయ్యారు.





ఎంతో మంది కలలుకనే విద్యా ప్రపంచం అది.
ఎందరినో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఆలయం అది.
ఒక్కసారి సీటు వస్తే చాలు విద్యార్థి భవిష్యత్తుకు
ధోకా ఉండదని భరోసా ఇచ్చే పాఠశాల.
ఉన్నత ప్రమాణాలను అనుసరిస్తూ ఉత్తమ విలువలతో
విద్యా బోధనతో పాటు విద్యార్థులను
అన్ని రంగాల్లో తీర్చిదిద్దే బడి...
అదే జవహర్ నవోదయ విద్యాలయ.





ఎన్‌సీసీలో ఫైరింగ్ శిక్షణ

ఇక్కడ చదివితే నవోదయమే

- సీటు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు
- అత్యుత్తమ ప్రమాణాలతో విద్యా బోధన
- పేద, మధ్య తరగతి విద్యార్థులకు గొప్ప అవకాశం
- ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 13న పరీక్ష

(పెద్దాపురం-ఆంధ్రజ్యోతి)

- కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో నవోదయ పాఠశాలను 1988లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది.
- ఇక్కడ ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్య అందిస్తారు. కార్పొరేట్ పాఠశాల స్థాయి వసతుల మధ్య నిపుణులైన ఉపాధ్యాయులు బోధిస్తారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఈ పాఠశాలలో ఇంటర్ ఎంబైపీసీ చదివే అవకాశం ఉంది.
- బాలబాలికలకు వసతిగృహాలు, భోజనం, విద్య, నోట్ బుక్స్, యూనిఫామ్, షూస్, టాయిలెట్ సామగ్రి ఉచితం.
- శాస్త్ర సాంకేతికతో కూడిన విద్య, క్రీడలు, యోగా ద్వారా విద్యార్థికి సంపూర్ణ వ్యక్తిత్వవికాసం కల్పిస్తారు.
- కంప్యూటర్ కోర్సులతో పాటు సంగీతం, డ్రాయింగ్, క్రాఫ్ట్, నృత్యం వంటి వాటిల్లో శిక్షణ ఇస్తారు.
- ఇక్కడ త్రిభాషా సూత్రం అమలుచేస్తారు. తెలుగు, ఆంగ్లం, హిందీ భాషలపై విద్యార్థులకు పట్టు లభిస్తుంది. వీటిలో చేరేందుకు పోటీ ఎక్కువగా ఉంటుంది.
- విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ శిక్షణ ఇస్తారు. సమ యపాలన, నిబద్ధత, నైతిక విలువలు నేర్పిస్తారు. ప్రాథమిక సైనిక శిక్షణ, మ్యాప్ రీడింగ్, కమ్యూనికేషన్, ఫైరింగ్ అంశాలు ఉంటాయి. సామాజిక సేవా కార్యక్రమాలు, సాహస కార్యకలాపాలైన పెరేడ్లు, ర్యాలీలు, సాహస శిక్షణ, టీమ్ లీడింగ్, సమయపాలన అభివృద్ధి చేస్తారు.

జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా 7,170 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష నిర్వహణకు 32 కేంద్రాలు కేటాయించారు. ప్రశ్నపత్రం ఎలా ఉంటుంది.... పరీక్ష రాసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మీకోసం...

మూడు విభాగాల్లో పరీక్ష...

ప్రవేశ పరీక్ష సమయం రెండు గంటలు. వంద మార్కులకు వంద ప్రశ్నలు మూడు విభాగాల్లో ఉంటాయి. ప్రతి విభాగంనూ ఐచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు. రీజనింగ్ (మేథాశక్తి)లో 50 మార్కులకు 40 ప్రశ్నలు, తెలుగు భాష పరీక్షలో ఐదు అంశాల్లో ఒక్కో అంశానికి నాలుగు మార్కులు చొప్పున 25 మార్కులు ఉంటాయి. ఇంగ్లిషు, తెలుగు మీడియం విద్యార్థులకు వేర్వేరు ప్రశ్నపత్రాలు ఇస్తారు.

ఎక్కువ మార్కులు ఏ విభాగంలో అంటే..

మేథాశక్తి విభాగంలో 40 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కులు చొప్పున మొత్తం 50 మార్కులు ఉంటాయి. విద్యార్థుల్లోని మేథాశక్తిని వెలికితీసేలా ఇవి ఉంటాయి. బొమ్మలతో కూడిన ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్న కింద నాలుగు సమాధానాలు బొమ్మల రూపంలో ఉంటాయి. ఈ ప్రక్రియలో సులభంగా మార్కులు పొందడానికి విద్యార్థులు సమయస్ఫూర్తితో ఆలోచించాల్సి ఉంటుంది. బొమ్మలను జాగ్రత్తగా గమనిస్తే తక్కువ సమయంలోనే సమాధానాలు గుర్తించవచ్చు. నవోదయ దరఖాస్తుతో పాటు పంపిణీ చేసిన సమాచారంలో ప్రతి విభాగానికి చెందిన నమూనా ఉంటుంది. దీన్ని పరిశీలించి



శ్రద్ధగా అభ్యాసం చేస్తే ఈ విభాగంలో సులువుగా 45 మార్కులు పొందే అవకాశం ఉంది.

గణితంలో ఇలా...

గణిత విభాగంలో 20 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కుల వంతున 25 మార్కులు ఉంటాయి. ఐదో తరగతి వరకు గల అన్ని చాప్టర్లలో ఒకటి లేదా రెండు చొప్పున ప్రశ్నలు అడుగుతారు. గణితంలో అధిక మార్కులు సంపాదించగలిగే విద్యార్థులు దాదాపుగా నవోదయలో సీటు పొందుతారు. సులభంగా మార్కులు సాధించేందుకు ప్రధాన గణిత సూత్రాలు నేర్చుకోవాలి. అంతేకాక 5 అంశాల ఆధారంగానే 25 ప్రశ్నలు ఉంటాయి.

భాషా పరీక్ష ఇలా..

విద్యార్థుల భాషా పఠనాసక్తిని అంచనా వేసేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఈ ప్రశ్నలు 25 మార్కులకు ఉంటాయి. ఈ విభాగంలో ఐదు పాఠ్యాంశాలు ఇస్తారు. ఒక్కో పాఠ్యాంశంలో నాలుగు ప్రశ్నల వంతున ఐదు పాఠ్యాంశాల్లో 25 మార్కులు ఉంటాయి. పాఠ్యాంశాల ఆధారంగా ఇచ్చే ప్రశ్నలకు సమాధానాలు అన్నీ ఒకేలా ఉంటాయి. నిశితంగా గమనిస్తే సమాధానం కచ్చితంగా గుర్తించేందుకు వీలవుతుంది.

ఉన్నత ప్రమాణాలతో ..

ఆరో తరగతిలో చేరేందుకు 80 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 75 శాతం గ్రామీణ ప్రాంతం వారికి, 25 శాతం నగరవాసులకు కేటాయించారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి సీటు సాధిస్తే వారి భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుంది. ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధనతో పాటు క్రీడలపై ప్రత్యేక దృష్టి, కార్పొరేట్ స్థాయి వసతులు ఉంటాయి.

ఏర్పాట్లు పూర్తి చేశాం



ఉమ్మడి జిల్లాలోని 32 కేంద్రాల్లో ఈ నెల 13న నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించేం దుకు అన్ని ఏర్పాట్లు చేశాం. మాస్ కాపీ యింగ్‌ను నిరోధించేందుకు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమిస్తున్నాం. ఎంఈవోల ఆధ్వర్యంలో ప్రశాంతంగా పరీక్ష నిర్వహించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

బి.సీతాలక్ష్మి, ప్రిన్సిపల్

ఈ సూచనలు పాటించండి...

- పరీక్షకు వెళ్లేటప్పుడు హాల్ టికెట్, ప్యాడ్, నీలం, నలుపు రంగు పెన్నులు తీసుకువెళ్లాలి.
- ప్రశ్నపత్రంలో అన్ని పేజీలు ప్రింట్, క్రమ సంఖ్య, మీడియం సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి.
- పరీక్ష కేంద్రానికి అరగంట ముందు వెళ్లాలి.
- జవాబు పత్రాన్ని ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా గమనించాలి. పేరు, హాల్ టికెట్ నెంబరు రాయాలి.
- జవాబు పత్రంలో ఎంచుకున్న సంఖ్యను బాక్సులో మధ్యలో సరిగా కనిపించేలా రాయాలి.
- జవాబు పత్రంలో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
- ప్రతి విభాగంలోనూ కచ్చితంగా ఉత్తీర్ణులు కావాలి.

రాజమహేంద్రవరం నాకు సెకండ్ హోమ్

- గోదావరి జిల్లాల ప్రజల ఆదరణ, ఆప్యాయత మరువలేనివి
- 350కి పైగా సినిమాల్లో నటించా
- నాకు ప్రేరణ విజయనిర్మల
- 'ఆంధ్రజ్యోతి'తో సహజ నటి జయసుధ



గోదావరి జిల్లాల ప్రజలు చూపించే ఆప్యాయత, ఆదరణ ఎనలేనివి... రాజమహేంద్రవరం నాకు సెకండ్ హోమ్ లాంటిది... అన్నారు సహజ నటి జయసుధ. క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనేందుకు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం వచ్చిన ఆమె సోమవారం మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె కొద్దిసేపు 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.

గోదావరి జిల్లాలతో మీ అనుబంధం?

1975-80 మధ్యలో గోదావరి జిల్లాల్లో షూటింగ్‌లకు వస్తే ఉండేందుకు సరైన హోటల్ సదుపాయం ఉండేది కాదు. కానీ గోదావరి జిల్లాల ప్రజలు మమ్మల్ని వారి సొంత కుటుంబసభ్యుల్లా చూసుకునేవారు. వారి ఆప్యాయత మరువలేము.

మీ సొంత ఊరు?

మా నాన్నగారిది తిరుపతి. అమ్మమ్మగారిది విజయనగరం. అయితే నాకు రాజమహేంద్రవరం సెకండ్ హోమ్ లాంటిది. ఇక్కడి ప్రజలు చాలా ప్రేమగా, గౌరవంగా చూసుకునేవారు. ఆ రోజులు వేరు. అవి గోల్డెన్ డేస్. నాకు కోస్తా ప్రాంతంలో ఫ్యాన్ ఫాలోయింగ్ వుంది.

సినీ పరిశ్రమలో నాటికీ, నేటికీ వచ్చిన మార్పులు?

చాలా ఆధునిక పరిజ్ఞానం వచ్చింది. అనేక మార్పులు వచ్చాయి. ఎంతో మందికి అవకాశాలు వస్తున్నాయి. కొత్త నటీనటులు వస్తున్నారు. బాగా చేస్తున్నారు. ఓటీటీ రంగ ప్రవేశం చేసింది.

మీరు ఇప్పటివరకు ఎన్ని సినిమాలు చేశారు?

350కు పైగా సినిమాలు చేశాను. అనేక పాత్రలు సంతృప్తి ఇచ్చాయి. కుటుంబ కథా చిత్రాలు బాగా పేరుతెచ్చాయి. నాడు అగ్రనటులతో నటించాను. నేటి అగ్రనటులకు తల్లి పాత్రలు పోషించాను. 25ఏళ్ల తర్వాత మలయాళం సినిమా చేస్తున్నాను. ఏ రోల్‌పడితే అది చేయను.

ప్రస్తుతం రాజకీయాలపై ఇంట్రస్ట్ వుందా?

గతంలో నేను తెలంగాణలో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా చేశాను. ప్రస్తుతం ఏ పార్టీలోనూ లేను. ఈ వయసులో రాజకీయాలకు సూట్ అవుతానా లేదో చూడాలి. ప్రస్తుతానికి ఆ ఆలోచన లేదు. రోల్ అనేది ముఖ్యం. అది ప్రామిస్ చెయ్యలేకపోయినప్పుడు ఉండలేము. రోజూ పని అనేది ఉండాలి. స్మృతిఇరానీలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి.

మీరు సినీ రంగంలోకి రావడానికి ప్రేరణ?

ఇది చిన్నప్పటి విషయం. గూగుల్‌లో కూడా తప్పులు ఉన్నాయి. నేను 12వ ఏట సినీ పరిశ్రమలోకి వచ్చాను. మా ఆంటీ విజయ నిర్మల గారు నన్ను తీసుకువచ్చారు. ఆమె నాకు ప్రేరణ. ఎన్నో సినిమాలు చేశాను. ఆనందంగా ఉంది.

రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి)

అమ్మ .. అనే పిలుపులో ఎంతో మాధుర్యం

- దేశంలో ఉన్నత స్థానంలో ఉన్నవారంతా మాతృభాషలో చదివిన వారే
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

దివాన్‌చెరువు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మమ్మీ, డాడీ అనే పిలుపు మంచిది కాదు.. అమ్మ అనే పిలుపులో ఉన్న మాధుర్యం మమ్మీలో ఉండదని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీకి చెందిన భారతీయ భాషాసమితి సంయుక్త ఆధ్వర్యంలో 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం' అనే అంశంపై రెండు రోజులపాటు జరిగే కార్యశాలను వెంకయ్యనాయుడు సోమవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అధ్యక్షత వహించిన ఈ సభలో వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మమ్మీ అనేది పెదవుల నుంచి వస్తుందని, అమ్మ అన్న పిలుపు మన అంతరాళం నుంచి వస్తుందన్నారు. కావాలంటే ఇంటికి వెళ్లాక పరిశీలించుకోవాలని చెప్పారు. ఇంగ్లీషు వారి పాలనలో బలవంతంగా మన మీద ఇంగ్లీషు రుద్దడమే కాకుండా, ఇంగ్లీషులో మాట్లాడితేనే ఉద్యోగం ఇస్తామని చెప్పడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇంగ్లీషు నేర్చుకోవలసి వచ్చిందని చెప్పారు. మనం కూడా మాతృభాషలో



సమావేశంలో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

చదివితేనే ఉద్యోగం అనే విధంగా ఉండాలన్నారు. మాతృభాషలో మాట్లాడడం అందరూ అలవరచుకోవాలన్నారు. ప్రధాని మోదీ గుజరాతీ భాషలోనూ,రాష్ట్రపతి ద్రౌపదిముర్ము తన మాతృభాష ఒడియాలోనే చదివారని, సుప్రీంకోర్టు పూర్వ ప్రధానన్యాయమూర్తి ఎన్వీ రమణ, తాను మాతృభాష తెలుగులో చదువుకున్నామని చెప్పారు. దేశంలో ఉన్నతస్థానాల్లో ఉన్నవారంతా మాతృభాషలో చదువుకున్నారని ఆయన స్పష్టంచేశారు. ప్రాథమిక విద్య, పరిపాలనా భాష మాతృభాషే కావాలని.. న్యాయస్థానాల్లో వాదప్రతివాదనలు, తీర్పులు కూడా మాతృభాషలోనే జరగాలన్నారు. తిట్టు కూడా తెలుగులో ఎంతో బాగుంటుందన్నారు. మన భాష, యన యాస, మనపాట, మన ఆట, మన గోస కాపాడుకోవాలని అన్నారు. నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ మాట్లాడుతూ భాష ఒక నిత్యప్రవాహిని, ఒక జీవనది, తరాలతోపాటుగా కాలానుగుణంగా అవసరాలకు తగినట్టుగా మారుతూ ముందుకు సాగుతూ ఉంటుందన్నారు. భాషను విభిన్న



కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వాడకానికి అనువుగా మలుచుకోవడానికి, నూతనపదజాల సృష్టికి ఒక ప్రణాళికను తయారు చేసుకోవడం శ్రేయోదాయకమన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత డీఎస్పీ, సైకాలజిస్ట్ నామగిరి బాబ్జీ రచించిన హేండ్ బుక్ ఆఫ్ డ్రగ్ ఎడిక్షన్ అండ్‌ది రోల్ ఆఫ్ ఎన్ఫోర్స్‌మెంట్ పుస్తకాన్ని, నన్నయ విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ సహాయాచార్యుడు మల్లిభాస్కర్ రచించిన మస్తాన్‌బాబు జీవనచిత్రం శిఖరాగ్రి మల్లి పుస్తకాన్ని, నర్సరీ రైతు పుల్లా సత్యనారాయణ రచించిన ధరణీపుత్రులు పుస్తకాలను వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. తొలుత నన్నయ ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనం వద్ద వీసీ ప్రసన్నశ్రీ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సభానంతరం వెంకయ్యనాయుడును సత్కరించి జ్ఞాపిక అందజేశారు. నన్నయ తెలుగుశాఖసహాయాచార్యుడు కేవీఎన్‌డీ వరప్రసాద్ స్వాగతం పలుకగా, జాతీయ కార్యశాల కోఆర్డినేటర్ తలారి వాసు కార్యశాల ఉద్దేశం వివరించారు. తెలుగు- సంస్కృత అకాడమి అధ్యక్షుడు ఆర్.డి.విల్సన్ (శరత్‌చంద్ర) మాట్లాడుతూ వైజ్ఞానిక, విజ్ఞానం ప్రతిబించేవిధంగా మ్యాగజైన్‌లు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వంటి ప్రముఖుల మోనోగ్రాఫ్ పుస్తకాలు తీసుకురాబోతున్నామని చెప్పారు. కార్యక్రమంలో తానా పూర్వాధ్యక్షుడు తోటకూర ప్రసాద్, భారతీయభాషా సమితి అకడమిక్స్ కోఆర్డినేటర్ కె.గిరిధరరావు, తదితరులు పాల్గొన్నారు.

సింహాచల క్షేత్రానికి సంపెంగ మొక్కలు

కడియం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ దేవస్థానానికి కడియపులంకకు చెందిన దుర్గా నర్సరీ అధినేత పెద్దిరెడ్డి శ్రీనివాస్ సోమవారం ఉచితంగా సంపెంగ మొక్కలు పంపించారు. గతంలో కూడా శ్రీనివాస్ సంపెంగ మొక్కలు అందజేశారు. అలాగే హుద్‌హుద్ తుపాన్ సమయంలో నేల కొరిగిన సంపంగి చెట్ల స్థానంలో వీటిని మళ్లీ నాటనున్నట్టు దేవస్థానం సూపరింటెండెంట్ హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో గంగుల సత్యనారాయణ, గెడ్డం ఆది నారాయణ, పెద్దిరెడ్డి శ్రీను, చల్లా దుర్గారావు, బాదం పెదకాపు, తదితరులు పాల్గొన్నారు.



లారీలో మొక్కలు పంపుతున్న రైతు శ్రీనివాస్

'భట్నవిల్లి'లో లక్ష్మీ హ్యుందాయ్ భారీ షోరూమ్

- జ్యోతిప్రజ్వలన చేసిన రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్



షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్ , చిత్రంలో సంస్థ చైర్మన్ కంభంపాటి , కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు

అమలాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి జంక్షన్ సమీపంలో ఏర్పాటైన లక్ష్మీ హ్యుందాయ్ భారీ షోరూమ్‌ను సోమవారం రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అతిథులు, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. తొలుత మంత్రికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో లక్ష్మీ హ్యుందాయ్ చైర్మన్ కంభంపాటి రామ్మోహనరావు, మాజీ ఎమ్మెల్సీ, కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, డీటీవో దేవిశెట్టి శ్రీనివాస్, బీజేపీ కిసాన్ జాతీయ నాయకుడు నల్లా పవన్‌కుమార్, మున్సిపల్ మాజీచైర్మన్ చిక్కాల గణేష్, ఎం.గోపాలకృష్ణరాజు, పెన్మెత్స జగ్గప్పరాజు, వైసీపీ నేత పీకే రావుతో పాటు పలువురు టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నాయకులు పాల్గొన్నారు. లక్ష్మీ హ్యుందాయ్ గ్రూపు రాజమహేంద్రవరం ఆపరేషన్స్ హెడ్ సునీల్‌కుమార్, సేల్స్ మేనేజర్ సత్యమూర్తితో పాటు పట్టణంలోని టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీకి చెందిన రాజకీయ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నో అత్యాధునిక సౌకర్యాలతో ఈ షోరూంను ప్రారంభించడం జరిగిందని కస్టమర్లకు అత్యంత విలువైన సౌకర్యాలను ఈ షోరూమ్ ద్వారా అందించడం జరుగుతుందని చైర్మన్ కంభంపాటి తెలిపారు. సేల్స్, సర్వీస్, బాడీ షాప్, యాక్సరీస్, స్పేర్ పార్ట్స్ వంటి అన్నిరకాల సేవలు కోనసీమ జిల్లా షోరూంలో అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు తెలిపారు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రితో పాటు ఇతర నేతలందరికీ ఆపరేషన్ హెడ్ సునీల్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నల్లా శ్రీధర్, ఆర్డీఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక సౌరభం .. గోదావరి తీరం

- ప్రముఖ రచయిత, నటుడు ఎల్‌బీ శ్రీరామ్



షూటింగ్‌లో పాల్గొన్న ఎల్‌బీ శ్రీరామ్

ధవళేశ్వరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి తీరం సహజసిద్ధమైన ప్రకృతి అందాలకు నిలయమని ప్రముఖ రచయిత, సినీ నటుడు ఎల్‌బీ శ్రీరామ్ పేర్కొన్నారు. సోమవారం ధవళేశ్వరంలోని రామపాదాలరేవు సమీపం గోదావరి నది ఒడ్డున జరిగిన టెలీ షూటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో ఈయన ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఈనెల 15న కడియంలో జరిగే రాష్ట్రస్థాయి సాహిత్య కార్యక్రమానికి రావాలని కోరుతూ కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, చల్లపిళ్ల కమిటీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు ఆహ్వానించారు.

కోటి తలంబ్రాల పంటకు వానర హారతి

- గోకవరం మండలం అచ్యుతాపురంలో నిర్వహణ
- గోటి కోటి తలంబ్రాలకు ధాన్యం సిద్ధం

గోకవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామతత్వాన్ని ప్రచారం చేయడంలో భాగంగా గోకవరం మండలం అచ్యుతాపురంలో సోమవారం 15వ కోటి తలంబ్రాల జ్ఞానయజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోటి తలంబ్రాలకు వానరహారతి అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీరామతత్వాన్ని ప్రచారం చేస్తున్న కోరుకొండ శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కల్యాణం అప్పారావు ఆధ్వర్యంలో ఈ జ్ఞానయజ్ఞం కొనసాగుతోంది. విత్తనం నుంచి తలంబ్రాల వరకు అంతా రామమయం అనే సద్భావంతో తొలుత విత్తనాలకు భద్రాచలం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో పూజలు చేయించిన అనంతరం అక్కడ నుంచి అచ్చు తాపురం తీసికొచ్చి కల్యాణం చక్రవేణి పొలంలో చల్లడం జరిగింది. క్రమంలో పండిన పంటకు వానర హారతి చేపట్టారు. అనంతరం రామభక్తులు వానరవేషంలో(రాముడు, సీత, ఆంజనేయుడు, సుగ్రీవుడు, జాంబవంతుడు, అంగదుడు) పంటను కోసి కుప్పవేసి సీతరామ అష్టోత్తర శతనామస్తోత్రం, హనుమాన్ చాలీషా పారాయణం చేశారు. కోటి తలంబ్రాల కోసం సేకరించిన ధాన్యాన్ని 5 రాష్ట్రాలలో 5 వేల మందిచే గోటితో ఒలిపించి కోటి తలంబ్రాలను సిద్ధం చేయనున్నట్టు అప్పారావు తెలిపారు. 15వ సారి భద్రాచలం, 8వ సారి ఒంటిమిట్ట, 4వ సారి అయోధ్యకు గోటి కోటి తలంబ్రాలను పంపడంలో భాగంగా కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన వివరించారు.





అచ్యుతాపురంలో ధాన్యం సిద్ధం చేస్తున్న వానర వేషధారులు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకే కోటి సంతకాల సేకరణ : బొత్స

రావులపాలెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలనే సంకల్పంతో వైసీపీ పాలనలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నదని, దాన్ని అడ్డుకోవడానికే కోటి సంతకాల సేకరణ చేపట్టామని వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెం సీఆర్సీ మీటింగ్ హాలులో వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి బొత్స

తాడువాయి... మరో మాట లేదోయి!




పోలవరం నిర్వాసితులకు పునరావాసం కేంద్రం అక్కడే..
వెళ్లడం ఇష్టంలేనివారి గురించి తర్వాత ఆలోచిస్తాం
ఐటీడీఏ పీవో మాటలు..
నిర్వాసితుల్లో రేగిన గుబులు

ఇటీవల కోయలగూడెంలో భూములు సందర్శించడానికి వెళ్లిన నిర్వాసితులు

కూనవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతానికి గిరిజనేతరుల పోలవరం నిర్వాసితులకు మరో ప్రత్యామ్నాయం లేదు. మీకు ఏలూరు జిల్లా తాడువాయిలోనే పునరావాసం.. ఒకవేళ కొంతమందికి అక్కడికి వెళ్లడం ఇష్టం లేకపోతే వారి గురించి తర్వాత ఆలోచిస్తాం.. అంటూ సాక్షాత్తూ చింతూరు ఐటీడీఏ పీవో, ఆర్అండ్ఆర్ ప్రత్యేకాధికారి శుభం నోక్వాల్ ఇటీవల తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తేల్చిచెప్పడంతో నిర్వాసితులకు గుబులు రేగింది. అల్లూరి జిల్లా కూనవరం మండలంలో 9 ప్రాధాన్య గ్రామాలను గుర్తించి ప్రభుత్వం పోలవరం పరిహారం ఇవ్వడానికి ముందుకొచ్చింది. ఇప్పటికే ఆ గ్రామాలకు ఇళ్లకు సంబంధించిన పరిహారం బ్యాంకు ఖాతాలో జమవుతుంది. అయితే 7 గ్రామాలకు పునరావాస ప్రక్రియ సజావుగా సాగుతున్నా కూనవరం, టేకులబోరు గ్రామాల్లో అధికారుల తప్పిదం కారణంగా చిక్కుముడి ఏర్పడింది. ఈ గ్రామాల ప్రజలకు మొదటిగా తాడువాయి పునరావాస కేంద్రమంటూ కొంతమందిని బస్సుల్లో తీసుకెళ్లి చూపించారు. కొంతమంది అంగీకారం తెలపగా మరికొంతమంది వ్యతిరేకించారు. కొంతకాలం తర్వాత వ్యతిరేకించిన వారికి కోయిలగూడెం గ్రామాన్ని చూపించారు. దీంతో మిగతావారు ఆ గ్రామానికి అంగీకారమంటూ అధికారులకు చెప్పారు. ఇప్పుడు కోయిలగూడెం గ్రామం పునరావాస కేంద్ర జాబితాలోలేదని కేవలం తాడువాయి మాత్రమే పునరావాస కేంద్రమని మండలంలో ప్రతీ ఒక్కరూ తాడువాయి గ్రామాన్నే ఎంచుకోవాలని అధికారులు చెప్పడంతో నిర్వాసితులు కంగుతిన్నారు. తమను బస్సుల్లో తీసుకెళ్లి కోయిలగూడెం గ్రామాన్ని ఎందుకు చూపించారని అక్కడ పునరావాసం కల్పిస్తామంటూ అధికారులు చెప్పిన మాట వాస్తవం కాదా అప్పుడు జాబితాలో ఉన్న గ్రామం ఇప్పుడు ఎందుకు లేదని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. అయితే పొరపాటు జరిగిందని, కోయిలగూడెంలో పునరావాసం కల్పించలేమని సాక్షాత్తు ఐటీడీఏ పీవో ఇటీవల జరిగిన సమావేశంలో తేల్చిచెప్పారు. అయితే ఇక్కడ నిర్వాసితులకు తాడువాయిలోనే పునరావాసం కల్పిస్తామని మరెక్కడా ప్రస్తుతానికి పునరావాసం లేదని పీవో చెప్పారు. ప్రత్యామ్నాయం వెతుక్కునే వారి గురించి తర్వాత ఆలోచిస్తామన్నారు. దీంతో కొంతమంది గత్యంతరం లేక తాడువాయినే పునరావాస కేంద్రంగా ఎంచుకుంటున్నారు.

పీవో సీసీతో సమావేశం ఏంటి?

తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం జరిగిన నిర్వాసితుల సమావేశానికి ఐటీడీఏ పీవో రాకుండా ఆయన సీసీ సమావేశం నిర్వహించడంతో నిర్వాసితుల నుంచి విమర్శలు వస్తున్నాయి. జీవనమరణ సమస్యలు వంటి పరిహారం విషయంలో జవాబుతనం లేని అధికారులను పంపించడం ఏంటని నిర్వాసితులు అంటున్నారు. ఐటీడీఏ పీవో కానీ, సంబంధిత అధికారులు కానీ వచ్చి నిర్వాసితుల కష్టాలు తెలుసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా పునరావాసంపై మరోసారి ఐటీడీఏ పీవో కూనవరంలో గ్రామసభ నిర్వహించనున్నారు. ఈ సభలోనైనా నిర్వాసితులకు స్పష్టమైన హామీ రావాలని వారు కోరుతున్నారు.



సూర్యకిరణం.. సింహభాగం..



గోదావరి.. ఆపై సూర్యాస్తమయం ఎంతో బాగుంటుంది. యానాం రాజీవ్ గాంధీ బీచ్ గౌతమీ గోదావరి ఒడ్డున సాయంత్రం సమయంలో కిరణాలు గోదావరిపై పడినప్పుడు.. అక్కడే ఉన్న సింహం బొమ్మ నోటి భాగాన సూర్యుడు ఉన్నట్టు కనిపించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించిందిలా..

- యానాం (ఆంధ్రజ్యోతి)



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

జాతీయ లోక్ అదాలత్‌లో

ఎక్కువ కేసులు పరిష్కారం కావాలి

పీడీజే గంధం సునీత ఆదేశం

రాజమహేంద్రవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్దసంఖ్యలో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో సోమవారం ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులతో ఆమె సమావేశమయ్యారు. కేసుల పరిష్కారంతోపాటు తగు పరిహారం అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసుల జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలని సూచించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

చేబ్రోలులో వైద్య, ఆరోగ్య శాఖ ఆర్డీ విచారణ



ఆర్డీ డాక్టర్ పద్మ శశిధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

గొల్లప్రోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు పీహెచ్‌సీని వైద్య, ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) డాక్టర్ పద్మ శశిధర్ సోమవారం పరిశీలించారు. ఈనెల 2న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తాళం వేసి ఉండడంతో సకాలంలో వైద్యం అందక శరభవరం గ్రామానికి చెందిన ఇమ్మంది మాణిక్యం మృతిచెందాడు. అదేరోజు కాకినాడ డీఎంఅండ్‌హెచ్‌వో నరసింహనాయక్ విచారణ చేసి డాక్టర్ సాయిరతన్‌ను సస్పెండ్ చేసి స్టాఫ్ నర్సుకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఇదే విషయంపై డాక్టర్ పద్మ శశిధర్ పూర్తిస్థాయిలో ఆసుపత్రిని తనిఖీ చేసి ఆ రోజు జరిగిన సంఘటనపై విచారణ చేశారు. టీడీపీ, జనసేన నాయకులు ఆసుపత్రిలో సమస్యలపై ఆమెకు వినతిపత్రాలు అందజేశారు. డీఎంహెచ్‌వో పీహెచ్‌సీకి వైద్య సిబ్బంది సక్రమంగా నియమించకపోవడం వల్లే ఇటువంటి సంఘటనలు ఎదురవుతున్నాయని ఆమెకు వివరించారు. సిబ్బంది డిప్యూటేషన్ రద్దు చేయాలని పలుమార్లు కోరినా పట్టించుకోలేదని తెలిపారు. ఈ ఘటనలో డాక్టర్‌పై చర్యలు తీసుకోవడం సరికాదని ఆర్డీ దృష్టికి తీసుకెళ్లగా, ఆమె లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వాలని కోరడంతో.. ఆవిధంగా వినతిపత్రం ఇచ్చారు. డీఎంఅండ్‌హెచ్‌వో నరసింహనాయక్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు ఆభరణం చోరీ

కేసు నమోదు

అమలాపురం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సినిమా రోడ్డులో ఉన్న శుభకలశం సెంటర్‌లో నివాసం ఉంటున్న గుబ్బల చంద్రావతి తెల్లవారుజామున టాయిలెట్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మెడలో ఉన్న 3 కాసుల బంగారు ఆభరణాన్ని దొంగ అపహరించుకుపోయాడు. చంద్రావతి ఇచ్చిన ఫిర్యాదుతో సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు.

చింతూరులో స్క్రబ్ టైఫస్ కేసు

బాధితుడు ప్రభుత్వ ఉద్యోగి

చింతూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరులో స్క్రబ్ టైఫస్ కేసు నమోదైనట్టు సోమవారం చింతూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కోటిరెడ్డి తెలిపారు. బాధితుడు ప్రభుత్వ ఉద్యోగి. వ్యాధి లక్షణాలను గుర్తించిన తదుపరి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈక్రమంలో బాధితుడు స్క్రబ్ టైఫస్ వ్యాధిన బారిన పడినట్టు నిర్ధారణ అయ్యింది. ఈ మేరకు చికిత్స అందిస్తున్నారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. చింతూరు ఏరియా ఆసుపత్రిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకొనేందుకు కిట్లు అందుబాటులో ఉన్నాయని.. ఎవరికైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే సకాలంలో ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందాల్సిందిగా డా.కోటిరెడ్డి సూచించారు.

ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి



చిన గంగరాజు(ఫైల్)

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారులో ఆటో బోల్తా పడి డ్రైవర్ మరణించాడు. గ్రామానికి చెందిన కోరగంటి చిన గంగరాజు(38) రాజమహేంద్రవరంలో ఉంటున్నాడు. గ్రామంలో పని ఉండడంతో ఆది వారం రాత్రి చేబ్రోలు వచ్చాడు. ఇంటి వద్ద తినడానికి ఏమైనా తెమ్మని చెప్పడంతో ఆటో తీసుకుని చేబ్రోలు-మల్లవరం రోడ్డుకు వెళ్లగా అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన గంగరాజును పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. గంగరాజు టీడీపీలో క్రియాశీలకంగా ఉండటంతో పాటు సాయిరామ్ ఆటో యూనియన్ సభ్యుడిగా ఉన్నారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నప్రసాద వితరణలో

భక్తులకు ఇబ్బందులు ఉండకూడదు

కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

అన్నవరం దేవస్థానం అధికారులకు పలు సూచనలు

అన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాల నుంచి కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులు స్వామి దర్శనానంతరం అన్నప్రసాదం స్వీకరించేందుకు విచ్చేసే సమయంలో వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో దేవస్థానం ఈవో సుబ్బారావు, అన్నదాన విభాగ ఏఈవో కృష్ణారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ కలిశారు. హాల్‌లో భక్తులకు నిరీక్షణ లేకుండా అన్నప్రసాదం రుచి, శుచిగా అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుత క్యూలైన్ ఇరుకుగా ఉందని దానిని నూతన భవనం పూర్తయ్యే సమయం వరకు తాత్కాలిక పద్ధతిలో విశాలంగా విస్తరించాలన్నారు. నూతన మరుగుదొడ్ల నిర్మాణ విషయంపై చర్చించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి సోమవారం ఒక దాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన చింతా అవినాస్ దంపతులు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించారు. దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు ఉన్నారు.



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు

న్యాయనిర్ణేతగా శ్రీనివాసరావు

అమలాపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఒడిసా అండర్-2025 మాస్టర్స్-2025 బ్యాడింట్మన్ వరల్డ్ ఫెడరేషన్ టూర్ హండర్డ్ అంతర్జాతీయ టోర్నమెంట్‌కు న్యాయ నిర్ణేతగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొంకాపల్లికి చెందిన పాయసం శ్రీనివాసరావుకు అవకాశం దక్కింది. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి సోమవారం నియామక ఉత్తర్వులను అందుకున్నారు. ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు ఒడిసాలోని కటక్ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఒడిసా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ జరుగుతుంది. ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గ్రేడ్-2 నేషనల్ ఎంపైర్ అయిన శ్రీనివాసరావు ప్రస్తుతం నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్‌కు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌కు మరోసారి న్యాయనిర్ణేతగా నియమితులైన శ్రీనివాసరావును ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి అంకమ్మచౌదరి, ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బాబు, కేఎస్‌డీఏ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, ఉపాధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, బీవీసీ సంస్థల అధినేత బోనం కనకయ్య, గంధం పల్లంరాజు తదితరులు అభినందించారు.



పాయసం శ్రీనివాసరావు

తూకం.. మోసం!

చేబ్రోలు పట్టు మార్కెట్‌లో తూనికల మోసం

100 కిలోలకు 2.50 కిలోల తరుగు

పట్టు రైతుల ఆందోళన



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆందోళన చేస్తున్న పట్టు రైతులు



50 కిలోల తూనికల రాళ్లు వేస్తే 48.88 కిలోలు మాత్రమే చూపిస్తున్న మిషన్

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ప్రభుత్వ పట్టుగూళ్ల విక్రయ కేంద్రం (పట్టు మార్కెట్)లో తూనికల విషయంలో మోసం జరుగుతుందంటూ రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. పట్టు మార్కెట్‌లో ఉన్న వెయింగ్ మిషన్‌ను మూడు సంవత్సరాలుగా తూనికల కొలతల శాఖకు తనిఖీల నిమిత్తం పంపకుండా పట్టు పరిశ్రమల శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారు ఆరోపించారు. దీని వల్ల పట్టుగూళ్ల బరువు 100 కిలోలకు 2.50 కిలోలు తక్కువగా చూపిస్తున్నదని తెలిపారు. 50కిలోల తూకం రాళ్లు తీసుకువచ్చి మిషన్‌పై వేయగా 48.88 కిలోలు మాత్రమే చూపించడాన్ని వారు గుర్తించారు. తూకంలో మోసంతో తాము లక్షలాది రూపాయిలను నష్టపోయామని, దీనికి బాధ్యులైన అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గొల్లప్రోలు మండలం చేబ్రోలు సెరీకల్చర్ ఫారమ్, పిఠాపురం పట్టణంలోని పాడా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మూడు సంవత్సరాలుగా నష్టపోయిన తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం పాడా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో రైతులు సీహెచ్.చక్రబాబు, రామకృష్ణ, ఉలవకాయల రాంబాబు, నల్లరావుల ఏసుబాబు, ఓ.ఏసుబాబు, గంగాధర్, శ్రీను, రామారావు, సూరిబాబు, శివ, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

మూసివేసిన చర్చిలను తెరిపించాలి

కాకినాడ కలెక్టర్‌ను కోరిన గొల్లప్రోలుకు చెందిన పాస్టర్లు



కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న వివిధ సంఘాల పాస్టర్లు

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పరిధి కొత్తపేటలో మూసివేసిన చర్చిలను తిరిగి తెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని వివిధ సంఘాల పాస్టర్లు, క్రైస్తవులు సోమవారం కాకినాడలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కోరారు. ఈమేరకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా క్రైస్తవ పాస్టర్లు, ప్రతినిధులు జేమ్స్, జాన్‌వెస్లీ, గుడాల శాంతి, పెంకే శ్రీను, ఇజ్రాయల్, రాజు, ఎలియాజర్ మాట్లాడుతూ 40 ఏళ్లుగా నడుస్తున్న చర్చిలను హిందూ సంఘాలు ఆందోళన నేపథ్యంలో మూసివేయడం తగదన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం అన్ని మతాలకు వారి భావాలను వ్యక్తపర్చే హక్కులు ఉన్నాయన్నారు. ఎవరికీ ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో చర్చిలు నిర్వహిస్తుంటే మూసివేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా దీనిపై విచారణ నిర్వహించి చర్చిలు తిరిగి ప్రారంభించే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పాస్టర్లు, క్రైస్తవులు వెల్లడించారు.

గొల్లప్రోలులో

కొనసాగుతున్న పోలీసు పికెట్

ప్రార్థనా మందిరాల వద్ద సర్వే

గొల్లప్రోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో హిందూ సంఘాల ఆందోళన తదనంతరం పరిణామాల నేపథ్యంలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. కొత్తపేట ప్రాంతంలో అనుమతులు లేకుండా రెండు చర్చిలు నిర్వహిస్తున్నారని, లౌడ్‌స్పీకర్లతో ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ హిందూ సంఘాలు ఆందోళనకు దిగడం, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు అక్కడ పర్యటించి చర్చిల కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇరువర్గాలు అక్కడ మోహరించిన నేపథ్యంలో కొత్తపేటలో నిషేధాజ్ఞలు విధించి అమలు చేస్తున్నారు. ఆర్డీవో ఆదేశాలు మేరకు ప్రార్థనా మందిరాలు ఉన్న ప్రాంతంలో నగర పంచాయతీ టీపీవో నీలిమాదీప్తి ఆధ్వర్యంలో సిబ్బంది సర్వే నిర్వహించి కొలతలు సేకరించారు. వీటికి అనుమతులు ఎలా తీసుకున్నారు, ఆక్రమణలు ఉన్నాయా లేదా తదితర అంశాలను ఆర్డీవోకు నివేదించనున్నారు. మరోవైపు ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్‌ను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని గొల్లప్రోలు తహశీల్దారు రామ్‌కుమార్, ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.



గొల్లప్రోలు కొత్తపేట ప్రాంతంలో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్

ప్రిన్సిపల్ జిల్లా కోర్టుల ఏర్పాటుపై హైకోర్టు జడ్జి సానుకూల స్పందన

వెల్లడించిన 'ఐఎల్ఏ' అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్

కాకినాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోర్టు ప్రాంగణాల్లో మౌలిక వసతులు కల్పించాలి, నూతన కోర్టు భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరడంతో పాటు పలు సమస్యలపై న్యాయవాదులు పోరాడుతున్నారు. కోర్టు భవనాలకు మైనర్ రిపేర్లు చేయాలని, కాకినాడలో డెట్ రికవరీ ట్రిబ్యునల్(డీఆర్టీ) ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను కూడా వినిపిస్తున్నారు. జిల్లా విభజన దృష్ట్యా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, కాకినాడల్లో ప్రిన్సిపల్ జిల్లా కోర్టులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ సమస్యలపై హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టుఫోలియో జడ్జిగా నియమితులైన జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ సానుకూలంగా స్పందించారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఏ) అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్ సోమవారం మీడియాకు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 16 బార్ అసోసియేషన్లు, 65 కోర్టుల్లో పదివేల మంది న్యాయవాదులు, 50వేలమంది కక్షిదారులు వస్తూ ఉంటారని, వారికి అవసరమైన మౌలిక వసతుల కల్పన విషయాన్ని జడ్జి జస్టిస్ దేవానంద్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

రిటైనింగ్ వాల్ పనుల్లో అక్రమాలపై విచారణకు ఆదేశం

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని రామచంద్రపురం మండలం ఓదూరులో ఆర్‌సీసీ రిటైనింగ్‌వాల్ పనుల్లో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం సోమవారం విచారణకు ఆదేశించింది. పలు ఉల్లంఘనల కారణంగా ప్రభుత్వానికి రూ.99.98 లక్షల నష్టం వాటిల్లినట్టు గుర్తించింది. ఈ నేపథ్యంలో పలువురు అధికారులను బాధ్యులుగా చేస్తూ విచారణకు ఆదేశించింది. ఇందులో భాగంగా అప్పటి క్వాలిటీ కంట్రోల్ కాకినాడ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తురంగి శ్రీనివాసు, మరో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ సత్యనారాయణ, ఏఈఈ బొల్లంకల అప్పలరాజులపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ విజిలెన్స్ విభాగం ఉత్తర్వులు ఇచ్చింది.

కొడుకుపై తల్లి ఫిర్యాదు

కొబ్బరికాయలు దొంగిలించాడని కేసు

అమలాపురం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొబ్బరికాయలు దొంగిలించాడని కుమారుడిపై తల్లి చేసిన ఫిర్యాదు మేరకు అమలాపురం పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరూరుకు చెందిన దూడల సత్యవతికి అదే గ్రామంలో 2ఎకరాల కొబ్బరి తోట ఉంది. తోటలో కొడుకు సత్తిపండు స్నేహితులతో కలసి కొబ్బరిదింపు తీసి 6వేల కాయలు తరలించుకుపోయాడని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరబాబు తెలిపారు.

ఫోన్ చూస్తూ కాలక్షేపం చేస్తున్నాడని

కొడుకుపై తండ్రి మందలింపు

ఇంటి నుంచి వెళ్లిపోవడంతో పోలీసులకు ఫిర్యాదు



అదృశ్యమైన ప్రదీప్

గొల్లప్రోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన బాలుడు అదృశ్యంపై ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. చేబ్రోలు హరేరామ నగర్‌కు చెందిన జాగు ప్రదీప్ (17) ఈనెల 6న ఫోన్ చూస్తూ కాలక్షేపం చేస్తున్నాడని తండ్రి సత్యనారాయణ మందలించాడు. దాంతో ఆ రోజు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి తిరిగిరాలేదు. దీంతో తండ్రి గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రదీప్ చేబ్రోలు ఆదర్శ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాఫీ కలర్ టీ షర్టు, కార్గో స్కూ బ్లూ ఫ్యాంటు ధరించాడని, ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రాజమహేంద్రవరం

క్రీస్తుతత్వం బోధపడితే
ఆయన మార్గాన్ని అనుసరిస్తారు

● రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో క్రిస్మస్ వేడుకల్లో సినీనటి జయసుధ



రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): క్రీస్తుతత్వం బోధపడితే యేసు ప్రభువు మార్గాన్ని అనుసరిస్తారని ప్రముఖ సినీనటి జయసుధ అన్నారు. రాజమహేంద్రవరంలో క్రిస్మస్‌వేడుక సందర్భంగా రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం జయసుధ స్థానిక ఎల్‌టీ శాస్త్రి రోడ్డులోని మాజీ ఎంపీ హర్షకుమార్ నివాసానికి వచ్చారు. ఈసందర్భంగా ఆమెకు హర్షకుమార్ సతీమణి సరళాకుమారి, తనయులు జీవీ శ్రీరాజ్ దంపతులు, జీవీ సుందర్ దంపతులు ఘనంగా స్వాగతించారు. శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా పలువురు పాస్టర్లకు నూతన వస్త్రాలను జయసుధ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం రాజీవ్ గాంధీ విద్యాసంస్థలలో ఫార్మసీ విభాగంలో జరిగిన కార్యక్రమంలో జయసుధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయసుధ మాట్లాడుతూ తాను ముందుగా ఇచ్చిన కమిట్‌మెంట్ మేరకు రామచంద్రపురం, చాగల్లు ప్రాంతాలలో జరిగే క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చానని చెప్పారు. విమానసర్వీసులు లేకపోయిన రోడ్డు మార్గంగుండా తాను చెన్నై నుంచి రాజమహేంద్రవరం వచ్చానని చెప్పారు. అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కుటుంబంతో తనకు ఎప్పటినుంచో మంచి అనుబంధం ఉందన్నారు. రాజకీయపరంగా కాకుండా తన బ్రదర్ ద్వారా ముందే హర్షకుమార్ తెలుసునని చెప్పారు. హర్షకుమార్ ఉండాల్సివుందని ఫ్లైట్లు రద్దుకావడంతో ఆయన ఇక్కడలేరని వారి కుటుంబం తననుస్వాగతించిందన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్ళూరి విజయకుమార్, యర్రా రామకృష్ణ పలువురు పాస్టర్లు, రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల అధ్యాపకులు పాల్గొన్నారు.

బిక్కవోలు లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు

బిక్కవోలు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రాచీన లక్ష్మీగణపతికి సంకట హర చతుర్థి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతినెలలో పౌర్ణమి తరువాత నాల్గవరోజు ఈ సంకట హరచతుర్థి వస్తోంది. ఈసందర్భంగా స్వామివారి మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో ఎ. భాస్కర్ తెలిపారు.

ఆర్‌టీఐహెచ్‌లో స్పార్క్ ప్రోగ్రామ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టరు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కీర్తి, జేసీ మేఘస్వరూప్

రాజమహేంద్రవరంరూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 9నుంచి 11వ తేదీవరకు స్పార్క్ పేరిట స్టార్టప్ ఐడియాలు వున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం రూరల్ మండలం బొమ్మూరులోగల రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్ ఆధ్వర్యంలో మూడురోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తిచేకూరి తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభదశ ఫౌండర్లు, ఇన్నోవేటర్లు, విద్యార్థులు స్టార్టప్‌పై ఆశక్తి వున్నవారిని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేస్తున్నామ న్నారు. మొదటిరోజు బొమ్మూరులోని రతన్‌టాటా ఇన్నోవేటివ్ హబ్ లోను, రెండోరోజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోను, మూడోరోజు ఆదికవి నన్నయ్య యూనిర్శిటీలో నిర్వహిస్తామని ఆర్టీఐహెచ్ డైరెక్టర్, జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్ తెలిపారు. వినూత్న ఆలోచనలతోవున్న అంకుర సంస్థల ఉనికి -సామ ర్థ్యంగల బిజినెస్ కాన్సెప్ట్‌గా అభివృద్ధి చేసుకోవ డానికి ఈ కార్యక్రమం చక్కని అవకాశమని, పాల్గొనేవారికి హబ్ ద్వారా మద్దతు అందిస్తామన్నారు. ఈకార్యక్రమానికి సంబంధించిన పోస్టరును కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ మేఘస్వరూప్, నోడల్ అధికారి సూర్యప్రకాష్‌తో కలిసి ఆవిష్కరించారు. హబ్ సిబ్బంది, తదితరలు పాల్గొన్నారు.

పుల్లా జీవితచరిత్ర పుస్తకావిష్కరణ

● ఆవిష్కరించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



పుల్లా జీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

కడియం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కడియపులంక సత్యదేవానర్సరీ రైతు, దివంగత పుల్లా నాగేశ్వరరావు జీవితచరిత్ర పుస్తకాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. రాజానగరం నన్నయ్యవిశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సోమవారం మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. సత్యదేవానర్సరీ యాజమాన్యం పుల్లా ఆంజనేయులు, పుల్లా వీరవెంకట్రావు, పెదసత్యనారాయణ, చినసత్యనారాయణ, రామకృష్ణ ఉన్నారు.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యకు ఎమ్మెల్యే స్వాగతం



రాజమహేంద్రవరం విమానశ్రయంలో వెంకయ్యకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం పర్యటనకు వచ్చిన మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడికి సోమవారం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్రతో కలిసి స్వాగతం పలికారు. రాజమహేంద్రవరం చేరుకున్న వెంకయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి వీరిరువురు స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కరించండి

● నగరపాలక సంస్థ పీజీఆర్ఎస్‌లో కమిషనర్ రాహుల్‌మీనా



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ రాహుల్‌మీనా

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు వివిధ సమస్యలతో కూడిన అర్జీలు వస్తున్న నేపథ్యంలో వచ్చిన అర్జీలు మరలా రాకుండా అధికారులు పరిష్కారం చూపించాలని కమిషనర్ రాహుల్‌మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 23 అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా కమిషనర్ రాహుల్‌మీనా మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ఇంజనీరింగ్‌కు 7, రెవెన్యూకి 2, టౌన్‌ప్లానింగ్‌కు 5, పబ్లిక్ హెల్త్‌కి 4, మెప్మాకి 3, సచివాలయాలకు 1, పంచాయతీరాజ్‌కు 1 వచ్చాయన్నారు. వీటిని పరిశీలన చేసి పరిష్కారం చూపించాలన్నారు. అర్జీల పరిష్కారం దిశగా తీసుకుంటున్న చర్యలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ, డిప్యూటి సిటీప్లానర్ నాయుడు, ఎమ్‌హెచ్‌వో డాక్టర్ వినూత్న, ఇంచార్జి ఎస్ఈ రీటా తదితరులు పాల్గొన్నారు.

● ప్లాస్టిక్ రీసైక్లింగ్ లీగ్ పోస్టర్ ఆవిష్కరణ

ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్‌మీనా అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్లాస్టిక్ రీసైక్లింగ్ లీగ్ పోస్టర్‌ను కమిషనర్ ఆవిష్కరించారు. ఈనెల 18,19 తేదీలలో పాఠశాలల్లోని విద్యార్థుల నుంచి ప్లాస్టిక్ డబ్బాలు, బాటిల్స్, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తామన్నారు. అత్యధికంగా వ్యర్థాలను సేకరించిన టాప్3 పాఠశాలకు మూడో శనివారం స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్రా కార్యక్రమంలో అవార్డులు అందిస్తామన్నారు. నగరపాలక సంస్థ, శక్తి ప్లాస్టిక్ ఇండస్ట్రీస్ సంయుక్తంగా నిర్వహించే ఈకార్యక్రమంపై వివరాలకోసం 9494060060కు కాల్ చేయాలని సూచించారు.

ఎన్‌హెచ్ పనులు వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే బత్తుల

దివాన్‌చెరువు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి) రాజానగరం నియోజకవర్గం పరిధిలోని జాతీయరహదారి పనులను వేగవంతం చేయాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. దివాన్‌చెరువులోని ఫ్లైఓవర్ పనుల ప్రగతిని ఆయన జాతీయరహదారుల పీడీ, కాంట్రాక్టర్, ఇంజనీర్‌లతో సోమవారం సమీక్షించారు. రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పనులు వేగవంతం చేయాలని సూచించారు. 216 హైవేలో దివాన్‌చెరువు నుంచి రాజమహేంద్రవరం వరకూ సెంట్రల్ లైటింగ్ ప్రతిపాదించాలని చెప్పారు. అప్రోచ్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని కోరారు.

చౌకధరల దుకాణం తనిఖీ చేసిన ఆర్డీఓ

దివాన్‌చెరువులోని చౌకధరల దుకాణం నెంబరు 39ను రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టాక్ లభ్యత, పంపిణీ రిజిష్టర్లు, లబ్ధిదారుల వివరాలు, ఆన్లైన్ రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. లబ్ధిదారులకు సరుకుల పంపిణీ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరుగుతోందో, లేదో ఆయన పరిశీలించి సంబంధితులకు సూచనలు ఇచ్చారు.

ముగిసిన ఎన్‌ఎస్ఎస్ సేవా శిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) :రాజమహేంద్రవరం పిడింగొయ్యిలో నిర్వహించిన ఎన్‌ఎస్ఎస్ యూనిట్ - 2 ప్రత్యేక సేవా శిబిరం సోమవారంతో ముగిసింది. ఈమేరకు స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, ఎన్‌ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కె.సుభాషిణి చేతులమీదుగా వాలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. వాలంటీర్ల సేవా స్ఫూర్తిని కొనియాడారు. ఎన్ఎస్ఎస్ అధికారులు హెచ్ శ్రీరామ్ పవన్, బి.భవానీ, పి.మురళీకృష్ణ, పిడింగొయ్యి గ్రామ పెద్దలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే

రాజమహేంద్రవరంఅర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే దేశ భక్తిభావంతో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే జాతీయ పతాకాన్ని, ఎన్‌సీసీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు నేషన్ ఫస్ట్ భావంతో ఉండాలని కోరారు. కాకినాడ జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఫండ్ కోసం ఉదారంగా విరాళాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కడియం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):నేడు మంగళవారం ఉదయం 10-30కు ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. అధికారులు ఆయా శాఖల నివేదికలతో ఈ సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో రమేష్ తెలిపారు.

18న వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై నిరసనలు : సీపీఐ

రాజమహేంద్రవరంఅర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతు సమస్యలపై ఈనెల 10న, వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై, 18న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరంలోని అపరాల సెక్షన్ కార్యాలయంలో జరిగిన శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలపై అన్ని జిల్లాల్లోని మార్కెట్‌యార్డుల ఎదుట నిరసనలు నిర్వహించనున్నామని తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు అమలు చేయడంలేదని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడంలేదన్నారు. ఈనెల 26వ తేదీకి సీపీఐ పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో సీపీఐ పతాకాలను ఆవిష్కరించడం, ప్రధాని మోదీ అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రదర్శనలు, సభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలి

రాజమహేంద్రవరంఅర్బన్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి) :కొత్త కొత్త యాప్‌ల ద్వారా ఉపాధ్యాయులపై పనిభారం పెంచడంతోపాటు అధికారుల ఒత్తిడి ఎక్కువైందని, వెంటనే ప్రభుత్వం వీటిపై తగినచర్యలు తీసుకుని మానసిక ఒత్తిడి తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎండీఎస్ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అన్నం వెంకటరావు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదలచేస్తూ టెన్త్ విద్యార్థులకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ అంటూ వారికి పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయులపై విద్యాశాఖ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, రోజుకో కొత్త విధానం తీసుకొచ్చారని పేర్కొన్నారు.

మత్స్యశాఖ అధికారులు మా కడుపు కొట్టారు

● 52 లక్షల చేప పిల్లలు చూపి 30వేలు మాత్రమే వదిలారు

● విలేఖరుల సమావేశంలో ఉద్ఘాటించిన మత్స్యకారులు



సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యకార నాయకులు

ధవళేశ్వరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):గోదావరిలో వేటే వృత్తిగా జీవనం సాగిస్తున్న మత్స్యకారుల కుటుంబాల జీవనోపాధి పెంపొందించే విధంగా మత్స్య సంపద అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ప్రతిఏటా మత్స్యశాఖ ఆధ్వర్యంలో గోదావరిలో పలు ప్రాంతాల్లో వివిధ సైజుల్లో ఉన్న చేపపిల్లలను వదులుతోంది. ఈ ఏడాది గత నెల 21న ప్రపంచమత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని ధవళేశ్వరంలోని కంచర్లలైన్ ఘాట్ వద్ద జిల్లా మత్స్యశాఖ అధికారులు కలెక్టర్, రాజమహేంద్రవరంరూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి, ఇతర అధికారులు, నాయకులతో అట్టహాసంగా కార్యక్రమం నిర్వహించి రూ.52లక్షల చేప పిల్లలను గోదావరిలో విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే, కలెక్టర్, ఇతర నాయకులు చేపపిల్లలను గోదావరిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతానికి ఒక్కొక్క వ్యాన్‌లో 10 ట్యాంకుల చొప్పున 11వ్యాన్‌లలో చేప పిల్లలను తీసుకొచ్చారు. కార్యక్రమం అనంతరం మిగతా చేపపిల్లలను విడుదల చేసే క్రమ ంలో 30వేలలోపు చేపపిల్లలను మాత్రమే తీసుకు వచ్చి వదులుతున్నట్లు గుర్తించిన మత్స్యకారులతో మ త్స్యశాఖ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. జి ల్లా అధికారిణి నిర్మలాకుమారి, ఇతర మత్స్యశాఖఅధికారులు వారిని సముదాయిస్తూ మొత్తం 52లక్షల చేపపిల్లలను వదులుతామని హామీ ఇచ్చారు. తదుపరి ఈరేవులో 52లక్షల చేపపిల్లలను వదిలినట్లుగా మత్స్యకార సొసైటీ సభ్యుల సంతకాలు పోస్టరీచేసి మత్స్యశాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపి స్థానిక మత్స్యకారులు తెల్లబోయారు. అధికారులు తమ పొట్టను కొట్టి వారి జేబులు నింపుకుంటున్నారని ఆరోపిస్తూ స్థానిక జాలరిపేటలో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. తమను మోసగించిన అధికారులపై నాయకులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

అన్నవరం దేవస్థానం అధికారుల చర్యలకు నిరసనగా ఆందోళన



రైతుల సమక్షంలో అధికారులను నిలదీస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి(అన్నవరం) దేవస్థానం అధికారుల చర్యలకు నిరసిస్తూ సోమవారం సాయంత్రం కోరుకొండ, శ్రీరంపట్నంకు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. ఇందుకు కారణం ఈరోజు అన్నవరం దేవస్థానం అధికారుల బృందం రైతులకు తెలియకుండా, రైతుల అనుమతి లేకుండా రైతుల పంట పొలాల వద్దకు వెళ్లి వాటిని సర్వే చేయడం, అవి లక్ష్మీనరసింహస్వామి భూములని చెప్పడంతో రైతులు ఆగ్రహావేశాలకు గురయ్యారు. తమ భూములకు మీరు వచ్చి సర్వేచేసే అధికారం ఎవరు ఇచ్చారంటూ నిలదీశారు. అనంతరం రైతులందరూ తహసీల్దార్ కార్యాలయంకు చేరుకుని కార్యాలయం బయట బైఠాయించారు. అన్నవరందేవస్థానం అధికారుల వైఖరికి నిరసనగా తాము ఈఆందోళన చేపట్టినట్లు తెలిపారు.

● ఎమ్మెల్యే రాకతో శాంతించిన రైతులు

తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న విష యం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హుటాహుటిన తహసీల్దార్ కార్యాలయంకు చేరుకున్నారు. అక్కడ రైతులతో మాట్లాడి వారిని శాంత పరిచారు. అనంతరం రైతుల సమక్షంలోనే అన్నవరం దేవస్థానం అధికారులను గట్టిగా మందలించారు. తనకు కానీ, తహసీల్దార్‌కు కానీ తె లియజేయకుండా మీరు నేరుగా రైతుల పొలాల్లోకి వెళ్లి సర్వే చేయడం తప్పని మందలించారు. దీంతో రైతులు శాంతించి ఆందోళన విరమించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో రైతు ప్రతినిధులు రొంగల శ్రీనివాస్, ముండ్రు రామారావు చౌదరి, ఉప్పలపాటి వీరాస్వామి, ఇసుకపల్లి రాజారావు, మద్దాల రమణ, కాటూరి మోహన్, కటకం చలం, మింగి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి'

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్‌జీవో సంఘం కృషి చేస్తున్నదని ఆ సంఘం జిల్లా కమిటీ ఛైర్మన్ ఎం.మాధవరావు అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలో ఏపీ ఎన్‌జీఓ సంఘ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాధవరావు మాట్లాడుతూ పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ ఏర్పాటు తదితర సమస్యల పరిష్కారానికి రాష్ట్ర జేఏసీ నేతృత్వంలో ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని అన్నారు. కొన్ని శాఖలకు నేటి వరకూ జీతాలు చెల్లించకపోవడంపై ఈ సమావేశంలో పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కన్వీనర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ ఇన్‌స్పెక్టర్ పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తి

● నేటి నుంచి 11వ తేదీ వరకు పరీక్షలు

● డీఆర్‌వో సీతారామమూర్తి

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): చెన్నైలోని స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ప్రాంతీయ డైరెక్టర్ సూచనల మేరకు డిసెంబరు 9నుంచి 11 తేదీ వరకు రాజమహేంద్రవరం కేంద్రంగా నిర్వహిస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి తెలిపారు. డీఆర్‌వో చాంబర్‌లో సోమవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీ పోలీస్, సెంట్రల్ ఆర్మ్ ఎ ాలీస్ ఫోర్సెస్ (సిఎపిఎఫ్)లో సబ్ ఇన్‌స్పెక్టర్ రిక్రూట్‌మెంట్ పరీక్ష-2025 పరీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పరీక్షలో రాజమహేంద్రవరంరూరల్‌లో కాతేరు గ్రామంలో జీఎస్ఆర్ ఆన్‌లైన్ అకాడమీ శ్రీసాయిరెసిడెన్సీ అపార్టుమెంట్‌లలో రెండు షిఫ్టులు పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం షిఫ్ట్‌లో 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, రెండో షిఫ్ట్‌లో మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. రాజమహేంద్రవరం కేంద్రంగా జరిగే ఈ పరీక్షలకు 500మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. అభ్యర్థులు పరీక్షాకేంద్రానికి సమయానికి హాజరై ఎస్ఎస్‌సీ జారీ చేసిన సూచనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎం. రవికుమార్, రూరల్ తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, జిల్లా వైద్యఅండ్ ఆరోగ్యశాఖ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.జాన్సన్ రాజు, డీఎస్‌బీ శాఖ సబ్‌ఇన్‌స్పెక్టర్ కె.ఆంజనేయులు, జీఎస్ఆర్ ఆన్‌లైన్ అకాడమీ సెంటర్ ఇంచార్జి వి.శశివినోద్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

గైనిక్ వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి

● జీజీహెచ్ వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : డెలివరీ కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)కి వచ్చిన గర్భిణికి పురుడుపోయడంలో గైనిక్ వైద్యులు నిర్లక్ష్యం చూపారని, అందువల్లే మృతి చెందిందని పేర్కొంటూ సోమవారం బాధిత కుటుంబ సభ్యులు, వైసీపీ శ్రేణులు జీజీహెచ్ వద్ద ఆందోళన చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, వైద్యసేవల్లో నిర్ల్యంగా వ్యవహరించిన గైనిక్ వైద్యులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ సంఘీభావం తెలుపుతూ నిరసనలో పాల్గొన్నారు. దీంతో జీజీహెచ్ వద్ద కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ ఆందోళన చేస్తున్నవారి వద్దకు వచ్చి ఈ సంఘటనపై విచారణకు ఆదేశించామని, మూడు రోజుల్లో నివేదిక అందజేయాలని ఉత్తర్వులు ఇచ్చామని, నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వారికి చెప్పారు. వివరాలిలా ఉన్నాయి ... రాజమహేంద్రవరం సిటీ లాలాచెరువు ప్రాంతానికి చెందిన పంపాన జయంతి గత సోమవారం డెలివరీ కోసం రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చేరింది. గర్భిణీకి అవసరమైన అన్ని టెస్టులు చేశారు. డెలివరీ కోసం అడ్మిట్ చేసుకున్నారు. ఫ్రీ డెలివరీ అవదు. ఆపరేషన్ చేయాలని చెప్పారని కానీ ఆపరేషన్ చేయకుండా జాప్యం చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తన కుమార్తె మృతిచెందిందని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. మాజీ ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలంటే లెక్కలేదా ? అన్నారు. జీజీహెచ్‌లో కనీస స్టాండర్డ్స్ లేవు. ఇంత దారుణమైన పరిస్థితిలో జీజీహెచ్ ఉందని విమర్శించారు. పదిహేను రోజులకు ఒకసారి జీజీహెచ్‌కు వెళుతున్నానని చెప్పే స్థానిక ఎమ్మెల్యే దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాస్తి రమాదేవి పందిరిపట్టె మంచం పుస్తకావిష్కరణ

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మానవతా విలువలకు నిలువుటద్దంగా, జాస్తి రమాదేవి కథలు ఉంటాయని తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్‌డీవిల్సన్ అన్నారు. సోమవారం స్థానిక రివర్‌బే హోటల్‌లో జాస్తి రమాదేవి రాసిన పందిరిపట్టెమంచం కథా సంకలనాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విల్సన్ ప్రసంగిస్తూ సాహిత్యం సమాజంలోని వెలుగా చీకట్లను వెలికి తీస్తుందన్నారు. పుస్తక రచయిత రమాదేవి మాట్లాతూ తన కథలు గతంలో స్వాతి, ఆంధ్రజ్యోతి వారపత్రికలలో వచ్చాయని సమాజంలోని మనుషుల్లో పెరిగిపోతున్న అంతరాలు తనను కదిలించి ఇటువంటి సాహిత్య సృష్టికి ప్రేరేపించిందన్నారు. ఈ సభకు ప్రముఖ రచయిత్రి తటవర్తి నాగేశ్వరి అధ్యక్షత వహించగా సహరి సంపాదకురాలు పసుపులేటి సత్యశ్రీనివాస్, దుద్దంపూడి అనసూయ, రచయితలుపాల్గొన్నారు.

నగరంలో కార్డన్ సెర్చ్

రాజమహేంద్రవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో సోమవారం తెల్లవారుజాము న కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. వన్‌టౌన్ పరిధి లో రికార్డు లేని 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు పాత నేరస్తుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రతిరోజూ కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నామని ఎస్పీ నరసింహకిషోర్ తెలిపారు. శాంతి భద్రతకు విఘాతం కలిగించే అసాంఘిక వ్యక్తులను ఉపేక్షించేది లేదన్నారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సత్యసాయిరాం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) :బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజమహేంద్రవరానికి చెందిన కాలెపు సత్యసాయిరాంను నియమిస్తూ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. సత్యసాయిరాం గతంలో జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడిగా, బీజేపీ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

సీఎం ఆర్ఎఫ్ నగదు చెక్కుల పంపిణీ

రాజానగరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లోని లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి విడుదలైన నగదు చెక్కులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ జనసేన పార్టీ నాసేన కోసం నావంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి సోమవారం అందజేశారు. హౌసింగ్ బోర్డు కాలనీ, దివాన్‌చెరువు,చక్రద్వారబంధం, కలవచర్ల, తూర్పుగోనగూడెం, పరిజల్లిపేట, కానవరం గ్రామాలకు చెందిన 11మందికి చెక్కులను అందజేశారు.

కలెక్టర్‌కు బీజేపీ నాయకుల వినతి

ధవళేశ్వరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం గ్రామ పంచాయతీలోని సచివాలయం1లో డిజిటల్ అసిస్టెంట్ పోస్టు కొన్ని నెలలుగా ఖాళీగా ఉందని దీనివల్ల ప్రజలు ఇంటి స్థలం, ఇతర ప్రభుత్వ పథకాల నమోదు కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ఆ పోస్టును భర్తీచేయాలని కోరుతూ బీజేపీ నాయకుడు ఒంటెద్దు స్వామి సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఉమెన్ పోలీస్ డిప్యూటేషన్‌పై ఎండీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారని, ఇంజనీరింగ్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్‌లు గ్రామాలపరిధిలో విధుల నిర్వహణవల్ల సేవలు అందడంలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఎమ్మెల్యే చొరవతో నక్కల కాలువ పూడికతీత పనులు

● 820 ఎకరాల ఆయకట్టు రైతులకు ఊరట



నక్కల కాలువ పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చొరవతో నక్కల కాలువ (నదురుబాద చానల్) పూడికతీత పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పూడికతీన పనులను సోమవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాపేశ్వరం నుంచి నదురుబాద వరకు సుమారు ఏడు కిలోమీటర్ల మేర సాగే ఈ కాలువకు 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం పూడిక తీతలు చేపట్టిందని తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం లో ఎక్కడా పూడికలు తీసిన దాఖలాలు లేవన్నారు. ఈ ఆయకట్టుపై సుమారు 820 ఎకరాల్లో రైతులు వరి సాగుచేస్తున్నారని కాలువ మూసుకుపోవడంతో సాగునీరందక రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రూ.4.50లక్షల నిధులతో పూడికతీతలు ప్రారంభించామన్నారు. తాపేశ్వరం నుంచి నదురుబాద వరకు ఈ పనులు నిర్వహిస్తున్నామన్నారు. చివరి ఎకరాకు కూడా సాగునీరు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు ఉన్నారు.

ప్రతిఇంటికి తాగునీరు అందిస్తాం


రంగంపేట(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం చండ్రేడులో రూ.7లక్షలతో ఏర్పాటుచేసిన మంచినీటి బోరును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, సౌకర్యం దృష్ట్యా ప్రతి గ్రామంలో తాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. అనంతరం రంగంపేట తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన క్యాడర్ కోసం నల్లమిల్లి. కార్యక్రమంలో పాల్గొని కూటమినాయకులు,కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవిందు, రాష్ట్రలీగల్ సెల్ కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, ఆత్మకమిటీ ఛైర్మన్ ఎలుగుబంటి సత్తిబాబు, మండలపార్టీ అధ్యక్షుడు ఉద్దండ్రావు శ్రీనివాసరావు, మండల జనసేన అధ్యక్షుడు సత్తిబాబు, పాల్గొన్నారు.

దరఖాస్తుకు సమాచారం ఇప్పించండి

సీతానగరం, డిసెంబరు 8(ఆంధ్ర జ్యోతి): సమాచార హక్కుచట్టంలో డ్వాక్రాకు సంబంధించి ఇచ్చిన దరఖాస్తుకు సమాచారం ఇప్పించండి అంటూ చినకొండేపూడికి చెందిన మేడిశెట్టి సరస్వతి పీజీఆర్‌ఎస్‌లో అర్జీ పెట్టుకున్నారు. సీతానగరం మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అధికారులు ఒక అర్జీని అందుకున్నారు. ఎంపీడీవో ఎం.భారతి తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేడిశెట్టి సరస్వతి అధికారులకు అర్జీని అందించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

బిక్కవోలు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంనకు చెందిన బందం సుభద్ర (65) అనే వృద్ధురాలు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆది వారం మృతి చెందిందని బిక్కవోలు ఎస్ఐ వి రవిచంద్రకుమార్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బందం అప్పారావు బలభద్రపురంలోని ఫౌల్ట్రీలో పనిచేస్తూ వృద్ధ్యా ప్యం కారణంగా పనిచేయలేక భార్య సుభద్రతో కలసి అక్కడే ఒక గదిలో వుంటున్నారు. గత నెల 28న సుభద్ర బయటకు వెళ్లి తిరిగి ఫౌల్ట్రీకి నడచుకుంటూ వస్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనగా ఆమె తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలింగచగా ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని ఎస్ఐ వివరించారు.



రేపటి నుంచి టెట్

రాజమహేంద్రవరం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(ఏపీ టెట్ అక్టోబర్ 2025) పేపర్ 1,2 ఈనెల 10 నుంచి 21 వరకూ నిర్వహిస్తున్నారని డీఈవో వాసుదేవరావు తెలిపారు. రాజమహేంద్రవరంలోని రాజీవ్ గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌లో సెషన్-1 ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకూ, సెషన్-2 మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్ వెనుక ముద్రించిన సూచనలు తప్పకుండా పాటించాలని చెప్పారు.

- టీడీపీ జిల్లా కమిటీల నియామకం ఎప్పుడో..
- త్రిసభ్య కమిటీ నివేదిక ఇచ్చినా.. ఇప్పటికీ ఇంతే
- జాప్యంపై పార్టీ అధినేత చంద్రబాబు అసంతృప్తి
- శనివారంలోపు స్పష్టత వచ్చే అవకాశం



జాప్యమేలా..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ఎప్పుడో ముగిసినా, జిల్లా కమిటీ నియామకం మాత్రం ఇంకా జాప్యం అవుతోంది. రెండు రోజుల కిందట అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడు పార్టీ నేతల సమావేశంలో జిల్లా కమిటీల నియామకం జాప్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం. ఈ శనివారంలోపు పేర్లలో స్పష్టత రావాలని కూడా ఆదేశించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈవారం చివరిలో గానీ, వచ్చేవారంలోగానీ జిల్లా కమిటీని ప్రకటించే అవకాశం ఉంది. కానీ ఇంకో సమాచారం కూడా ఉంది. ఈనెల 17న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కొందరు నేతలతో సమావేశం కానున్నట్టు తెలిసిందే. అదే నిజమైతే అప్పటివరకూ కమిటీ ప్రకటన ఉండకపోవచ్చు. కొన్ని వారాల కిందట మంత్రులు, ఇతర ముఖ్య నేతలతో త్రిసభ్య కమిటీలను జిల్లాలకు పంపి, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ముఖ్యనేతల అభిప్రాయాలు కూడా సేకరించారు. ముగ్గురు పేర్లు ఫైనల్ చేసిన ఈ కమిటీ నివేదిక కూడా ఇచ్చింది. కానీ అధ్యక్షుడి విషయంలో ఏకాభిప్రాయం కుదిరినా, జిల్లా కమిటీల్లో ఇతర నేతల విషయానికి సంబంధించి కొందరి పేర్ల విషయంలో ఏకాభిప్రాయం లేనట్టు సమాచారం. వచ్చే శనివారంలోపు పేర్ల విషయంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

కొత్త జిల్లాలతో మార్పులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విడిపోయిన తర్వాత తూర్పుగోదావరి, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాలు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇటీవల కొద్దిగా మార్పు కూడా జరిగింది. తూర్పుగోదావరి జిల్లాలో మండపేట నియోజకవర్గం కూడా విలీనం చేశారు. ఈనెలాఖరిలోపు అధికారిక ప్రకటన కూడా రానుంది. అందువల్ల పార్లమెంట్ స్థాయిని దాటి జిల్లాలు ఉండే పరిస్థితి ఉంది. కొత్తగా రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా కూడా ఏర్పడనుంది. అందువల్ల ప్రస్తుతం నాలుగు జిల్లాల కమిటీలను నియమించే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ చాలావరకూ కుటుంబ సాధికార సారథులు, బూత్, గ్రామ కమిటీలు, క్లస్టర్, యూనిట్, మండల, పట్టణ, డివిజన్ కమిటీలు, అనుబంధ కమిటీలు, నియోజకవర్గ అనుబంధ కమిటీలు నియామకం పూర్తయింది. వాస్తవానికి మేనెల చివరలో జరిగే తెలుగుదేశం పార్టీ మహానాడుకు ముందే ఈ కమిటీ నియామకం పూర్తికావాలి. కానీ ఆలస్యం అయింది. తర్వాత ఇవన్నీ పూర్తిచేశారు. ఇంతవరకూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడు జిల్లాలకు ముగ్గురు అధ్యక్షులను నియమించారు. ఇవాళ పోలవరం జిల్లా కమిటీ కూడా నియమించే అవకాశం ఉంది. ఇక తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి కేఎస్ జవహర్‌కు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి రావడంతో ఆయన జిల్లా అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవడంతో అది ఖాళీ అయింది. దీంతో ఇక్కడ కొత్త అధ్యక్షుడిని నియమించవలసి ఉంది. జిల్లా నుంచి మూడు పేర్లు పరిశీలన చేసిన నివేదిక ఇచ్చారు. కాకినాడ జిల్లాకు జ్యోతుల నవీన్ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. అక్కడ కూడా కమిటీ మూడు పేర్లతో నివేదిక ఇచ్చింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షురాలిగా రెడ్డి అనంతలక్ష్మి వ్యవహరిస్తున్నారు. అక్కడ పరిస్థితి కూడా అంతే. గతంలో ఇచ్చినట్టు ఒకరు ఓసీ, ఒకరు బీసీ, ఒకరు ఎస్సీకి పదవి ఇస్తారు. లేదా రాష్ట్రం యూనిట్‌గా తీసుకుని ఇంకెవరికైనా అధ్యక్ష పగ్గాలు కట్టబెడతారా అనేది ఇంకా స్పష్టత లేదు. పోలవరం జిల్లాకు కమిటీని నియమిస్తే మాత్రం కచ్చితంగా ఎస్టీ వర్గం నుంచే నియమించే అవకాశం ఉంది. ఎస్టీని నియమిస్తే అక్కడి ఎమ్మెల్యేకి మధ్య ఆధిపత్య పోరు మొదలవుతుందేమోనని పార్టీ ఆలోచిస్తే, ఇతర వర్గాలకు కూడా పదవి కట్టబెట్టే అవకాశం లేకపోలేదు. మొత్తానికి జిల్లా కమిటీలు కూడా ప్రకటిస్తే టీడీపీలో మరింత జోష్ పెరుగుతుంది.



కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 213 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 213 అర్జీలు ప్రజల నుంచి స్వీకరించామని కలెక్టర్ కీర్తి చేకూరి వెల్లడించారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ రెవెన్యూ, సర్వే సంబంధిత అర్జీలు అత్యధికంగా వచ్చాయన్నారు. గ్రీవెన్స్‌లో అందిన అర్జీలను శాఖాధిపతులు పర్యవేక్షణలో పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని.. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఆయా హాస్టళ్లను ప్రత్యక్షంగా పరిశీలించి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆహార అండ్ పౌరసరఫరాలు, పోలీసుశాఖలకు చెందిన అర్జీలు ఎక్కువగా వస్తున్నట్టు తెలిపారు. ఈసారి రెవెన్యూ శాఖకు105, పంచాయతీరాజ్ అండ్ గ్రామీణ అభివృద్ధిశాఖకు 49, హోంశాఖకు 18, వినియోగదారుల వ్యవహారాలు-ఆహార పౌరసరఫరాలకు 22, మున్సిపల్ పరిపాలనకు 7, వ్యవసాయశాఖకు 5, పాఠశాల విద్యకు 4, విద్యుత్ శాఖకు 3, హౌసింగ్ శాఖకు 2, నీటి పారుదలశాఖకు 2 అర్జీలు, ఇతర శాఖలకు కలిపి మొత్తం 213 అర్జీలు స్వీకరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై.మేఘాస్వరూప్, డీఆర్వో టి.సీతారామమూర్తి, ఎస్డీసీ ఎస్.భాస్కరరెడ్డి, పి.భాగ్యలక్ష్మి, సీపీవో జాయింట్ డైరెక్టర్ ఎల్.అప్పలకొండ, డీఎస్పీ విద్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 32 ఫిర్యాదులు



జిల్లా పోలీసు కార్యాలయంలో అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

రాజమహేంద్రవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 32 ఫిర్యాదులను ఎస్పీ నరసింహ కిషోర్ స్వీకరించారు. చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.





నన్నయ విశ్వవిద్యాలయంలో నన్నయ విగ్రహానికి పూలమాల వేస్తున్న వెంకయ్యనాయుడు.. సభలో పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

అమ్మ.. అనే పిలుపులో మాధుర్యం మమ్మీలో ఉండదు!

- సూర్యారాయాంధ్ర నిఘంటువును పునర్ముద్రణ చేస్తామని పవన్ ప్రకటించడం హర్షణీయం
- నన్నయలో 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం'పై కార్యశాల ప్రారంభ సభలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

దివాన్‌చెరువు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి) : మమ్మీ, డాడీ అనే పిలుపు మంచిది కాదు.. అమ్మ అనే పిలుపులో ఉన్న మాధుర్యం మమ్మీలో ఉండదని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీలోని భారతీయ భాషా సమితి సంయుక్త ఆధ్వర్యంలో 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం' అనే అంశంపై రెండ్రోజులపాటు జరిగే కార్యశాలను వెంకయ్యనాయుడు సోమవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అధ్యక్షత వహించిన సభలో వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మమ్మీ అనేది పెదవుల నుంచి వస్తుందని, అమ్మ అన్న పిలుపు మన అంతరాళం నుంచి వస్తుందన్నారు. కావాలంటే ఇంటికి వెళ్లాక పరిశీలించుకోవాలని చెప్పారు. ఇంగ్లీషు వారి పాలనలో బలవంతంగా మన మీద ఇంగ్లీషు రుద్దడమే కాకుండా, ఇంగ్లీషులో మాట్లాడితేనే ఉద్యోగం ఇస్తామని చెప్పడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇంగ్లీషు నేర్చుకోవలసి వచ్చిందని చెప్పారు. మనం కూ డా మాతృభాషలో చదివితేనే ఉద్యోగం అనే విధంగా ఉండాలన్నారు. మాతృభాషలో మాట్లాడడం అందరూ అలవరచుకోవాలన్నారు. దేశంలో ఉన్నతస్థానాల్లో ఉన్నవారంతా మాతృభాషలో చదువుకున్నారని ఆయన స్పష్టంచేశారు. ప్రాథమిక విద్య, పరిపాలనా భాష మాతృభాషే కావాలని.. న్యాయస్థానాల్లో వాదప్రతివాదనలు, తీర్పులు కూడా మాతృభాషలోనే జరగాలన్నారు. తిట్టు కూడా తెలుగులో ఎంతో బాగుంటుందన్నారు. మనభాష, యన యాస, మనపాట, మన ఆట, మన గోస కాపాడుకోవాలని అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూర్యారాయాంధ్ర నిఘంటువును పునర్ముద్రణ చేస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. వాట్సాప్‌లలో గుడ్ మార్నింగ్, గుడ్ ఆఫ్టర్‌నూన్, గుడ్ ఈవెనింగ్, గుడ్ నైట్ అని కాకుండా నమస్తే అంటే తెలుగులో అంటే అన్నివేళలకూ సరిపోతుందని సోదాహరణంగా చెప్పారు. రాజమహేంద్రవరం అని పలకడం చేతకాక వారు రాజమండ్రి అన్నారని, అందంగా రాజమహేంద్రవరం అని పలకాలన్నారు. నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ మాట్లాడుతూ భాష ఒక నిత్యప్రవాహిని, ఒక జీవనది, తరాలతో పాటుగా కాలానుగుణంగా అవసరాలకు తగినట్టుగా మారుతూ ముందుకు సాగుతూ ఉంటుందన్నారు. భాషను విభిన్న శాస్త్రసాంకేతిక రంగాల్లో వాడకానికి అనువుగా మలుచుకోవడానికి, నూతనపదజాల సృష్టికి ఒక ప్రణాళికను తయారు చేసుకోవడం శ్రేయోదాయకమన్నారు. అటువంటి శ్రేయస్సుకు ఈ కార్యశాల ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా విశ్రాంత డీఎస్పీ, సైకాలజిస్ట్ నామగిరి బాబ్జీ రచించిన హేండ్ బుక్ ఆఫ్ డ్రగ్ ఎడిక్షన్ అండ్‌ది రోల్ ఆఫ్ ఎన్ఫోర్స్మెంట్ పుస్తకాన్ని, నన్నయ విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ సహాయాచార్యుడు మల్లిభాస్కర్ రచించిన మస్తాన్‌బాబు జీవనచిత్రం శిఖరాగ్రిమల్లి పుస్తకాన్ని, నర్సరీ రైతు పుల్లా సత్యనారాయణ రచించిన ధరణీపుత్రులు పుస్తకాలను వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. తొలుత నన్నయ ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనం వద్ద వీసీ ప్రసన్నశ్రీ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం నన్నమఘుణ్ణి శాసనం నన్నయ రచనలతో ఏర్పాటుచేసిన స్టాల్‌ను ఆయన సందర్శించారు. సభానంతరం వెంకయ్యనాయుడును సత్కరించి జ్ఞాపిక అందజేశారు. నన్నయ తెలుగుశాఖసహాయాచార్యుడు కేవీఎన్‌డీ వరప్రసాద్ స్వాగతం పలుకగా, జాతీయ కార్యశాల కోఆర్డినేటర్ తలారి వాసు కార్యశాల ఉద్దేశం వివరించారు. తెలుగు- సంస్కృత అకాడమి అధ్యక్షుడు ఆర్.డి.విల్సన్ (శరత్‌చంద్ర) తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాల నాటికి.. కోటసత్తెమ్మ ఆలయ ఆధునికీకరణ

- అమ్మవారి తిరునాళ్లలో మంత్రి దుర్గేష్



కోటసత్తెమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కోటసత్తెమ్మ ఆలయ ఆధునికీకరణ పనులు చేపట్టి గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ తల్లి దేవాలయాన్ని తిరునాళ్ల సందర్భంగా సోమవారం ఆయన దర్శించుకున్నారు. శంఖుచక్రగధ అభయహస్తయజ్ఞోపవీతధారిణిగా ఏకశిలాస్వయంభూ విగ్రహంతో త్రిశక్తి స్వరూపిణిగా ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి మంత్రి దుర్గేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి సారె సమర్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులపాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న అమ్మవారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం కోటసత్తెమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. అనంతరం నిడదవోలుపట్టణంలోని నంగాలమ్మ తల్లిని దర్శించుకుని పూలు, పండ్లు సమర్పించారు. ఆయనతో మున్సిపాలిటీ చైర్మన్ భూపతి ఆదినారాయణ, అసిస్టెంట్ కమిషనర్ హరిసూర్యప్రకాష్, దేవస్థానం ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్ ఉన్నారు.



పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

బాల్య వివాహాల నిర్మూలన
సమాజం బాధ్యత : కలెక్టర్

రాజమహేంద్రవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలన బాధ్యత సమాజంపై ఉందని, ఆ దిశగా ముందుకు రావాలని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. 'బాల్యం చదువు-తగిన వయసు తర్వాతే పెళ్లి' అనే సందేశంతో అవగాహన కార్యక్రమాలు ప్రారంభించామని చెప్పారు. సోమవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై పోస్టర్‌ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహ ముక్త్ భారత్ 100 రోజుల ప్రచార కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో బాల్య వివాహాల నివారణపై సమగ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇవి మార్చి 8 వరకూ కొనసాగుతాయన్నారు. కనీసం వివాహ వయసు అమ్మాయికి 18, అబ్బాయికి 21 నిండకుండా వివాహం చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ సామాజిక రుగ్మతను రూపుమాపడంలో ప్రతి కుటుంబం, గ్రామం, పాఠశాల.. ఇలా అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో గ్రామ/వార్డు, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో బాల్య వివాహ నిరోధ కమిటీలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. రెవెన్యూ, విద్య, పోలీసు, ఐసీడీఎస్ విభాగాలతో కలిపి మొత్తం 11 మంది ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారన్నారు. ప్రతి నెల మొదటి, మూడో శుక్రవారం సమావేశాలు నిర్వహిస్తామని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు సమాచారం ఉంటే 1098, 100, 112 టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ మేఘస్వరూప్, డీఆర్వో సీతారామమూర్తి పాల్గొన్నారు.

తోటల పెంపకానికి 35శాతం సబ్సిడీ : కలెక్టర్

రాజమహేంద్రవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : హార్టీకల్చర్ పంటల ప్రోత్సాహం కింద 35శాతం సబ్సిడీ ఉందని, విలువ ఆధారిత పంటలతోనే రైతులకు ఆదాయం ఎక్కువ వస్తుందని, రైతులు సంప్రదాయ పంటలతోపాటు అనుబంధ పంటల సాగుపై కూడా దృష్టిపెట్టాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంకాలం జాయింట్ కలెక్టర్ వై. మేఘాస్వరూప్ హార్టికల్చర్, వ్యవసాయ అధికార్లతో కలసి హార్టికల్చర్ రైతులతో సమీక్షించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ సీజనల్ డిమాండ్, స్థానిక వినియోగ అవసరాల ప్రకారం సాగు చేస్తే రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్నారు. హార్టికల్చర్ సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని, నాణ్యమైన ఫలాలు, కూరగాయలు సరఫరా చేస్తే మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని, రైతులు సృజనాత్మకంగా సాగు చేయాలన్నారు. రైతుల అభిప్రాయాలు, ఎదరవుతున్న ఇబ్బందులు, పాజిటివ్, నెగిటివ్ అంశాల మీద నేరుగా ఫీడ్‌బ్యాక్ సేకరించి, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే వ్యూహాలు అమలుచేయాలన్నారు. మిషన్ ఇంటిగ్రేటెడ్ ఇన్ హార్టికల్చర్ (ఎంఐడీహెచ్) పథకం కింద 35 శాతం సబ్సిడీ పొందవచ్చన్నారు. తోటల పెంపకం, పండ్లు, కూరగాయలు, సుగంధ, ఔషధ మొక్కల సాగు, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం, నర్సరీ స్థాపన, కోల్డ్ స్టోరేజ్ సదుపాయాలు పొందవచ్చన్నారు. జిల్లా హార్టికల్చర్ అధికారి ఎన్. మల్లికార్జునరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీవనిధర్ రామన్ పాల్గొన్నారు.

నేటి నుంచి 11 వరకు
ఆర్‌టీఐహెచ్‌లో స్పార్క్ ప్రోగ్రామ్

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంగళవారం నుంచి 11వ తేదీ వరకు స్పార్క్ పేరిట స్టార్టప్ ఐడియాలు ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం రూరల్ మండలం బొమ్మూరులో గల రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్ ఆధ్వర్యంలో 3 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభ దశ ఫౌండర్లు, ఇన్నోవేటర్లు, విద్యార్థులు, స్టార్టప్‌పై ఆసక్తి ఉన్నవారిని దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తొలిరోజు బొమ్మూరులోని రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్‌లోను, రెండోరోజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోను, మూడోరోజు ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలోనూ నిర్వహిస్తామని ఆర్టీఐహెచ్ డైరెక్టర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘస్వరూప్ తెలిపారు. వినూత్న ఆలోచనలతో ఉన్న అంకుర సంస్థల ఉనికి- సామర్థ్యంగల బిజినెస్ కాన్సెప్ట్‌గా అభివృద్ధి చేసుకోవడానికి ఇది చక్కని అవకాశమన్నారు. ఈ కార్యక్రమ పోస్టరును జిల్లా కలెక్టర్, జేసీ, నోడల్ అధికారితో కలిసి ఆవిష్కరించారు.

పెట్టుబడి అవకాశాల వినియోగం కోసం
జిల్లా అభివృద్ధికి నివేదిక : కీర్తి

రాజమహేంద్రవరం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం అభివృద్ధి ప్రాంతం(వీఈఆర్) అభివృద్ధి దిశగా ప్రభుత్వం ఆర్థిక మాస్టర్ ప్లాన్‌ను అమలుచేయనుందని, అందులో భాగంగా జిల్లా స్థాయి శాఖలు తక్షణం అనుసంధాన చర్యలుచేపట్టాలని, పెట్టుబడి అవకాశాలకోసం జిల్లా అభివృద్ధికి నివేదిక సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. అమరావతి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన తర్వాత ఆమె స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా అధికార్లకు ఆదేశాలు ఇచ్చారు. పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, వ్యవసాయాధారిత ప్రాసెసింగ్ యూనిట్లు, ఉపాధి అవకాశాల పెంపు తదితర వాటిపై దృష్టి పెట్టాలన్నారు. పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్ సౌకర్యాలు, ఐటీ, డేటా సెంటర్ల అవకాశం, పర్యాటక అభివృద్ధి వంటి అంశాలకు సంబంధించి జిల్లాకు అనుకూలంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో లభించే పెట్టుబడి అవకాశాలను సమగ్రంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ మేఘస్వరూప్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీవనిధర్ రామన్, జిల్లా వ్యవసాయా ధికారి ఎస్. మాధవరావు, జిల్లా పరిశ్రమల ప్రమోషన్ అధికారి వై.టి ప్రకాశ్‌కుమార్, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎన్.మల్లికార్జునరావు హాజరయ్యారు.

ఆలస్య రుసుం లేకుండా పదో తరగతి పరీక్ష ఫీజుకు నేడు చివరి తేదీ

రాజమహేంద్రవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఆలస్య రుసుం లేకుండా ఫీజు చెల్లించడానికి మంగళవారం చివరి తేదీ అని జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు తెలిపారు. ఈ ఏడాది మార్చిలో పరీక్షలు రాసి ఫెయిల్ అయిన విద్యార్థులకు కూడా ఇవే తేదీలు వర్తిస్తాయన్నారు. 10వ తేదీ నుంచి 12 వరకూ రూ.50, 13 నుంచి 15 వరకూ రూ.200, రూ.500 ఆలస్య రుసుంతో 16 నుంచి 18 వరకూ ఫీజు చెల్లించవచ్చన్నారు. స్కూల్ లాగిన్ ద్వారా మాత్రమే చెల్లించాలని, సీఎఫ్ఎంఎస్, బ్యాంకు తదితర చెల్లింపులు అంగీకరించరని చెప్పారు. కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు, దివ్యాంగ విద్యార్థులకు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. దివ్యాంగ విద్యార్థులు దివ్యాంగత్వ ఒరిజినల్ సర్టిఫికెట్‌ని సమర్పించాలన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

డివిజనల్ పీజీఆర్‌ఎస్‌కు 18 ఫిర్యాదులు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): డివిజనల్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్- మీకోసం)లో 18 ఫిర్యాదులు స్వీకరించినట్టు కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం డివిజనల్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఇందులో భాగంగా పలు ప్రాంతాల నుంచి బాధితులు వచ్చి అర్జీలను సమర్పించారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలు పరిష్కారంలో నూటికి నూరుశాతం నాణ్యతతో పాటు పూర్తి స్పష్టత ఉండాలన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులను 1100 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా, మీకోసం వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులు అందించవచ్చునన్నారు. అలాగే అర్జీల యధార్థ స్థితిగతులను తెలుసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో కేఆర్‌సీ తహశీల్దార్ పి. అచ్యుతకుమారి, ప్రభుత్వశాఖల డివిజనల్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 41 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన యువత

నిడదవోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం నైపుణ్యాభివృద్ధి శాఖ, నేషనల్ కెరీర్ సర్వీస్ సహకారంతో ఉద్యోగమేళాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్రప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్‌వీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కంపెనీల్లోని ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, మొత్తం 67 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇందులో 41 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు ఆయన చెప్పారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి నియామక పత్రాలు అందజేశారు.

తాళ్లపూడిలో సహకార సంఘ ఉద్యోగుల నిరసన



డీసీసీబీ బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

తాళ్లపూడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ప్రాథమిక సహకార సంఘాల ఉద్యోగులు సోమ వారం నిరసన చేపట్టారు. తాళ్లపూడి డీసీసీబీ బ్యాంకు వద్ద తాళ్లపూడి, పోలరం మండలాల ఉద్యోగులు తమ విధులకు సెలవు పెట్టి బ్యాంకు కార్యాలయాన్ని మూయించి వేశారు. ఈ సందర్భంగా సహకార సంఘ అధ్యక్షుడు బొర్రా రామచంద్రం మాట్లాడుతూ జీవో నెంబర్ 36 ను తక్షణం అమల్లోకి తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఐదు సంవత్సరాలకు వేతన సవరణ జరగాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, రూ. 5 లక్షలకు తగ్గకుండా ఆరోగ్యబీమా కల్పించాలని, 2019 తరువాత చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో తాళ్లపూడి, పోలవరం మండలాలు ప్రాథమిక సహకార సంఘాల కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపం ... నిలిచిపోయిన సదరం సేవలు

● గోపాలపురంలో ప్రజల ఇక్కట్లు ● పట్టించుకోని అధికారులు

గోపాలపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో సాంకేతిక లోపం కారణంగా సదరం సేవలు నిలిచిపోయాయి. దీంతో స్లాట్ బుక్ చేసిన పలువురు సోమవారం ఇబ్బందులకు గురయ్యారు. ఆరోగ్య కేంద్రంలో 2024 సంవత్సరం వరకు సదరం సేవలు అందుబాటులో ఉండేవి. కాగా, ఇటీవల కాలంలో ఈ సేవలను 50 పడకలు, 100 పడకల ఆసుపత్రులకే ప్రభుత్వం పరిమితం చేసింది. దీంతో ఈ ప్రాంతంలో సదరం సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, గోపాలపురం ఆసుపత్రిలో సేవలు ఉన్నట్టు కనిపించటంతో ఈ ప్రాంత ప్రజలు ఎంపిక చేసుకుంటున్నారు. వాస్తవానికి ఈ సేవలను ఈ ఆసుపత్రిలో భౌతికంగా అందుబాటులో లేకపోయినప్పటికీ, ఆన్‌లైన్‌లో చూపిస్తోంది.

ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించిన ఆసుపత్రిలో ఈ సేవలు పునరుద్ధరించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు

బిక్కవోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలులో ప్రాచీన లక్ష్మీగణపతికి సంకట హర చతుర్థి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేసారు. ప్రతి నెలలో పౌర్ణమి తరువాత నాల్గవ రోజు సంకట హర చతుర్థి వస్తుంది. ఈసందర్భంగా స్వామివారి మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

శాంతియుత సమాజ స్థాపనకు కృషి చేద్దాం

● సెమీ క్రిస్మస్‌లో మంత్రి దుర్గేష్



సమిశ్రగూడెం సెమీక్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మంత్రి

నిడదవోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, కరుణకు ప్రతీకగా నిలిచిన ఏసు ప్రభువు ఆశించిన శాంతియుత సమాజ స్థాపనకు కృషిచేద్దామని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. సోమవారం సమిశ్రగూడెం బేతెస్థ ప్రార్థన మందిరంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దైవజనులు మంత్రిని ఆశీర్వ దించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి శాంతియుతమైన, ప్రేమపూర్వకమైన జీవనమార్గాన్ని ఉపదేశించి సమాజాన్ని సంస్కరించిన యుగకర్త ఏసుప్రభువు అని కొనియాడారు. అలాగే ప్రతిఒక్కరూ స్వార్థాన్ని వీడితేనే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందన్నారు. 2024 ఎన్నికల ప్రచారంలో ఇక్కడికి వచ్చిన తనపై ఏసు ప్రభువు ఆశీస్సులు కురిపించారని, ఈ క్రమంలో తాను ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యే అయ్యాయని, తర్వాత మంత్రిని అయ్యాయని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనా మందిరం పెద్దలు, కూటమి నాయకులు, విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.

● డీసీసీబీ ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తా

డీసీసీబీ ఉద్యోగుల సమస్యలపై క్యాబినేట్‌లో చర్చించి, పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. సోమవారం పట్టణంలోని రాష్ట్ర సహకార ఉద్యోగుల సంఘం జేఏసీ పిలుపు మేరకు డీసీసీబీ బ్రాంచ్ వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రికి వారంతా వినతి పత్రం సమర్పించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ 11వ తేదీన జరిగే క్యాబినేట్ సమావేశంలో దీనిపై ప్రస్తావిస్తానన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు, డీఎస్ఎన్ మూర్తి, కే.శ్రీనివాస్, పెండ్యాల వరలక్ష్మి, పి. ప్రకాష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సింహాచల క్షేత్రానికి పాదయాత్రగా టీడీపీ నాయకులు



మాజీ జడ్పీటీసీ లక్ష్మీ రమణి వెంట వెళ్తున్న టీడీపీ నాయకులు

నల్లజర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024 జరిగిన ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అఖండ విజయం సాధిస్తే సింహాచలం క్షేత్రదర్శనం చేసుకుంటామని టీడీపీ నేతలు మొక్కుకున్నారు. దానిలో భాగంగా సోమవారం పాదయాత్రగా బయలు దేరి వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. ఇందులో ద్వారకాతిరుమలకు చెందిన మాజీ జడ్పీటీసీ లక్ష్మీరమణి ఉన్నారు. ఈ సందర్భంగా ఆమెకు సంఘీభావం తెలియ జేందుకు నల్లజర్ల టీడీపీ నాయకులు యలమాటి శ్రీనివాస్, కండెపు వెంకటరత్నం, నిమ్మలపూడి ప్రసాద్, తదితరులు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ పాలన భేషుగ్గా ఉందన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అలాగే ఎమ్మెల్యేలు కూడా బాగా పనిచేస్తున్నారన్నారు.

పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

● ఎమ్మెల్యే ముప్పిడి



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కొవ్వూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో 13 మందికి రూ. 6,01,327 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం, తిరుగుడుమెట్ట, అన్నదేవరపేట, తాళ్లపూడి, చాగల్లు మండలం ఊనగట్ల, దారవరం, చాగల్లు, మార్కొండపాడు, చంద్రవరం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు అందజేశారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, అర్జిల్లి రామకృష్ణ, ఆళ్ల హరిబాబు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, బొడ్డు కేశవ, కూచిపూడి గణపతి, పెనుమాక జయరాజు, దొంగ రామకృష్ణ, తాళ్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మదనగోపాలస్వామి ఆలయ భూముల రీ సర్వే



ఆలయ బూములను సర్వే చేస్తున్న సిబ్బంది

తాళ్లపూడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మదనగోపాలస్వామి దేవస్థానానికి చెందిన ఆలయ భూములకు సోమవారం రీసర్వే నిర్వహించారు. పోచవరంలో ఆలయానికి చెందిన భూములు 6.42 ఎకరాల భూమిని జిల్లా దేవాదాయ అధికారి ద్వారా ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులు, తాళ్లపూడి మండల సర్వే అధికారులు సర్వే నిర్వహించారు. 6042 ఎకరాలకు సర్వే నిర్వహించగా, 4.00 ఎకరాలు ఆలయానికి సంబంధించినదిగా గుర్తించారు. మిగిలిన 2.42 ఎకరాలు అర్చక సర్వీస్ ఈనాం భూమిగా గుర్తించారు. ఆ భూమి మొత్తం పొజిషన్‌లోకి తీసుకున్నామని ఈవో ప్రకాశం తెలిపారు.

10 నుంచి ధ్యాన ఆరోగ్య యోగా శిక్షణ

కొవ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో ఈ నెల 10వ తేదీ నుంచి 18 వరకు శ్రీను గురూజీ, ఆది కనకలక్ష్మీ మాతాజీలచే ధ్యాన ఆరోగ్య యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు యనమదల సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 5 నుంచి 7-30 వరకు, సాయంత్రం 6 నుంచి 8-30 వరకు, ప్రత్యేకంగా మహిళలకు ఉదయం 10-30 నుంచి 1-00 గంట వరకు క్లాసులకు హాజరుకావచ్చన్నారు. శిక్షణ తరగతులలో అమృతాహారం అందించడం జరుగుతుందన్నారు. వివరాలకు కంటమణి కిషోర్, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, పి.జి.మూర్తిరాజు, గుణ్ణం శ్రీసత్యనారాయణ, మద్దిపట్ల శివరామకృష్ణ, చిరంజీవిను సంప్రదించాని సూచించారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

21న ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ కొవ్వూరు తాలూకా యూనిట్ ఎన్నికలు

కొవ్వూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ కొవ్వూరు తాలూకా యూనిట్ ఎన్నికలు ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్టు అడహక్ కమిటీ ఛైర్మన్ మీసాల మాధవరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించడానికి కొవ్వూరు పట్టణ, మండలంలోని ఎన్‌జీజీవో సంఘ సభ్యులు ఈనెల 9వ తేదీ సాయంత్రం 4-30 గంటలలోగా ఓటరుగా నమోదు కావాలన్నారు. 13వ తేదీన ఉదయం 10-30 నుంచి 4-30 గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. 21వ తేదీన ఉదయం 10-30 నుంచి 4-30 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికల అధికారిగా రాజమహేంద్రవరం యూనిట్ కార్యదర్శి ఎస్.ప్రవీణ్‌కుమార్, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా రాజమహేంద్రవరం యూనిట్ ఉపాధ్యక్షులు పి.ఆనందరావు, పర్యవేక్షణ అధికారిగా జిల్లా సంయుక్త కార్యదర్శి పి.అనీల్‌కుమార్‌ని నియమించడం జరిగిందన్నారు. కొవ్వూరు ఉప ఖజానా అధికారి కార్యాలయ నోటీసు బోర్డులో పూర్తి వివరాలు ఉన్నాయని, ఎన్‌జీజీవో సంఘసభ్యులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



కొత్తపల్లి జరిగిన సభలో పాల్గొన్న అధికారులు, నాయకులు

పెరవలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి సచివాలయం వద్ద సోమవారం ఉపాధి హామీ పథకంలో భాగంగా సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బం డారు వెంకట రమణ సాయిబాబా, ఎన్ఆర్ ఈజీఎస్ అబ్జర్‌వర్ ఎస్‌కే నూర్జహాన్, బర్రే దొరసామి, బండారు బాబీ, కార్యదర్శి భాను కుమార్, ఫీల్డ్‌అసిస్టెంట్ ఏలూరు శ్రీను, తదితరులు పాల్గొని గతంలో చేపట్టిన పనులపై సమీక్ష నిర్వహించారు.

ఘనంగా కుంతీదేవి అమ్మవారి వార్షికోత్సవాలు



వాదాలకుంటలో విచిత్ర వేషధారణ ప్రదర్శన

గోపాలపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాదాలకుంటలో కుంతీదేవి అమ్మవారి వార్షిక ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కుంతీదేవి ఉత్సవ విగ్రహాన్ని డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణల నడుమ అంగరంగ వైభవంగా పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం అమ్మవార్ని ఊరచెరువులో నిమజ్జనం చేశారు.

ఐడీ కార్డులు అందజేత

దేవరపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం హైస్కూల్, ఎలిమెంట్రీస్కూల్ విద్యార్థులకు గోపాలపురం నియోజకవర్గ హ్యూమన్ రైట్స్ కన్వీనర్ పోలుమాటి నాని సోమవారం ఐడీ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నారని, ప్రతిఒక్కరికీ ఐడీ కార్డు ఉండాలనే ఉద్దేశంతో వీటిని అందజేయడం జరిగిందని తెలిపారు. అనంతరం పాఠశాల టీచర్లు, పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ సజీవ దహనం

దేవరపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లికి చెందిన పైడికొండల దుర్గారావు (39) అనే లారీడ్రైవర్ ప్రకాశం జిల్లాలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సజీవ దహనమయ్యాడు. కొవ్వూరు నుంచి అనంతపురానికి వేప నూనె ట్యాంకర్‌తో వెళ్తుండగా.... ప్రకాశం జిల్లా బేస్తవారి పేట మండలం పెంచికలపాడు సమీపంలో ఎదురుగా వచ్చిన టమాటా లోడు లారీ ఢీకొనడంతో విషాదం చోటుచేసుకుంది. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

భక్తాంజనేయుడి ఊరేగింపు

చాగల్లు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చాగల్లు సెంటర్‌లోని భక్తాంజనేయస్వామి వారి ఊరేగింపు సోమవారం వేడుకగా జరిగింది. ఐదు రోజుల పాటు నిర్వహించారు. ప్రతి రోజూ స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తూ... సాంస్కృతిక భజనలు చేశారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషాలతో ఊరేగింపు సాగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కనకదుర్గమ్మకు వెండి మకరతోరణం బహూకరణ



పాలంగిలో అమ్మవారిని అలంకరించిన దృశ్యం

ఉండ్రాజవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాలంగిలో వేంచేసియున్న కనకదుర్గ అమ్మవారికి అదే గ్రామానికి చెందిన సత్తి బాలకృష్ణ, అనంత లక్ష్మిదంపతులు నూతన రజిత మకర తోరణం (వెండితో) బహూకరించారు. సుమారు రూ. లక్ష విలువ చేస్తే దీన్ని సోమవారం అమ్మవారికి అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తీపర్రులో పురాతన చెట్టు తొలగింపు



శివాలయం వద్ద ఉన్న నిద్రగన్నేరు చెట్టును తొలగిస్తున్న దృశ్యం

పెరవలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తీపర్రు శివాలయం వద్ద సుమారు వంద సంవత్సరాలకు పైగా వయస్సు గల పురాతన చెట్టును తొలగించారు. గ్రామంలో విద్యుత్‌లైన్లు వేస్తున్న పనుల్లో భాగంగా చెట్టు అడ్డు రావడంతో ఈ చెట్టును తొలగించారు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా కళ్ల ముందున్న చెట్టును తొలగించడంతో వృక్ష ప్రేమికులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. అయితే పక్కనే గతంలోనే రావిచెట్టు నాటడంతో అది పెరిగి, పెద్దది అవుతోంది. నాలుగైదు సంవత్సరాల్లో చెట్టులేని లోటును ఈ చెట్టు పూడ్చుతుందని పలువురు సంతృప్తి వ్యక్తం చేశారు.

సమాజానికి సేవ చేయాలన్న సంకల్పంతోనే పార్థ్ ఇండియా సంస్థ ప్రారంభం

● వ్యవస్థాపకుడు వీరాస్వామి



మహిళలకు కుట్టుమిషన్లు అందిస్తున్న వీరాస్వామి

నల్లజర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాల్యంలో కష్టాలను ఎదుర్కొంటూ విద్య సాధించి దేశ-విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఎదిగిన తర్వాత సమాజానికి తిరిగి సేవ చేయాలన్న సంకల్పంతో పార్థ్ ఇండియా సంస్థను ప్రారంభించినట్లు ఆ సంస్థ వ్యవస్థాకుడు బేతాల వీరాస్వామి పేర్కొన్నారు. పార్థ్ ఇండియా సంస్థ స్థాపించి 15 ఏళ్లు పూరైన సందర్భంగా సోమవారం దూబచర్లలో సేవ మహోత్సవ సభ సంస్థ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ యర్నగూడెం వంటి మారుమూల ప్రాంతంలో ప్రారంభమైన సంస్థ నేడు జిల్లా, రాష్ట్ర, దేశ, విదేశాల స్థాయిలో విస్తరించడం తమ సేవా సిద్ధాంతానికి ప్రతీక అన్నారు. అలాగే ఉచిత మెగా వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరాలు, అంబులెన్స్ ఏర్పాటు, విద్యార్థులకు ఉచిత ట్యూషన్ కేంద్రాలు, కుట్టుమిషన్, కంప్యూటర్ శిక్షణ, ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం వంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్‌లు అందించారు. కార్యక్రమంలో కారుమంచి గణేశ్, నెక్కంటి వెంకటేశ్, అచ్యుతరావు, చీమ కుర్తి కృష్ణప్రసాద్, ఎండీ ఇలియజ్ షరీష్, తాతిన సత్యనారాయణ, ఆల్లాడ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మండల ఎస్టీయూ నూతన కార్యవర్గం



ఎంపికైన నూతన కార్యవర్గ సభ్యులు

తాళ్లపూడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండల ఎస్టీయూ నూతన కార్యవర్గ ఎన్నిక అన్నదేవరపేట మండల పరిషత్ మెయిన్ స్కూల్‌లో ఎస్టీయూ పూర్వపు అధ్యక్షురాలు జేడీ సునీత అధ్యక్షతన సోమవారం జరిగాయి. దీనికి జిల్లా అధ్యక్షుడు జె. డానియల్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. మండల ఎస్టీయూ అధ్యక్షుడిగా యు. రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షునిగా ఎం. రఘురామ్, ప్రధాన కార్యదర్శిగా బీ. బుచ్చిబాబు, మహిళా కార్యదర్శులుగా కాత్యాయని,రేవతి, నాగజ్యోతి, జిల్లా కౌన్సిలర్లుగా జేడీ సునీత, చిల్లాజీరావు, జీ. రామకృష్ణ నియమితులయ్యారని తెలిపారు.

ముగిసిన కోటసత్తెమ్మ తిరునాళ్ల ఉత్సవాలు



అమ్మవారి ఆలయంలో గరగలు ఎత్తుకున్న ప్రముఖులు, ఆలయ అధికారులు

నిడదవోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో జరుగుతున్న కోటసత్తెమ్మ తిరునాళ్ల ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ప్రతిరోజు అమ్మవారికి విశేష కుంకుమ పూజలు, ఉదయం చండీ పారాయణం, సాయంకాలం చండీహోమాలను నిర్వహించారు. సాయంకాలం ముగింపు సందర్భంగా మేళతాళాలతో అమ్మవారికి గరగోత్సవం జరిగింది. ఆలయ ఆవరణలో నిర్వహించిన సన్నాయి మేళం, తాసాలు, గరగల నృత్యాలు, మరోపక్క కూచిపూడి, జానపద నృత్యప్రదర్శనలు, చిన్నారుల కోలా టాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. ఈ ముగింపు ఉత్సవాలలో భక్తులతో పాటు అనేక మంది ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ఆలయంలో జరుగుతున్న గరగోత్సవం

రాజమహేంద్రవరం నాకు సెకండ్ హోమ్

» గోదావరి జిల్లాల ప్రజల ఆదరణ, ఆప్యాయత మరువలేనివి

» 350కి పైగా సినిమాల్లో నటించా

» నాకు ప్రేరణ విజయనిర్మల

» 'ఆంధ్రజ్యోతి'తో సహజ నటి జయసుధ



గోదావరి జిల్లాల ప్రజలు చూపించే ఆప్యాయత, ఆదరణ ఎనలేనివి... రాజమహేంద్రవరం నాకు సెకండ్ హోమ్ లాంటిది... అన్నారు సహజ నటి జయసుధ. క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనేందుకు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం వచ్చిన ఆమె సోమవారం మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె కొద్దిసేపు 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.

గోదావరి జిల్లాలతో మీ అనుబంధం?

1975-80 మధ్యలో గోదావరి జిల్లాల్లో షూటింగ్‌లకు వస్తే ఉండేందుకు సరైన హోటల్ సదుపాయం ఉండేది కాదు. కానీ గోదావరి జిల్లాల ప్రజలు మమ్మల్ని వారి సొంత కుటుంబసభ్యుల్లా చూసుకునేవారు. వారి ఆప్యాయత మరువలేము.

మీ సొంత ఊరు?

మా నాన్నగారిది తిరుపతి. అమ్మమ్మగారిది విజయనగరం. అయితే నాకు రాజమహేంద్రవరం సెకండ్ హోమ్ లాంటిది. ఇక్కడి ప్రజలు చాలా ప్రేమగా, గౌరవంగా చూసుకునేవారు. ఆ రోజులు వేరు. అవి గోల్డెన్ డేస్. నాకు కోస్తా ప్రాంతంలో ఫ్యాన్ ఫాలోయింగ్ వుంది.

సినీ పరిశ్రమలో నాటికీ, నేటికీ వచ్చిన మార్పులు?

చాలా ఆధునిక పరిజ్ఞానం వచ్చింది. అనేక మార్పులు వచ్చాయి. ఎంతో మందికి అవకాశాలు వస్తున్నాయి. కొత్త నటీనటులు వస్తున్నారు. బాగా చేస్తున్నారు. ఓటీటీ రంగ ప్రవేశం చేసింది.

మీరు ఇప్పటివరకు ఎన్ని సినిమాలు చేశారు?

350కు పైగా సినిమాలు చేశాను. అనేక పాత్రలు సంతృప్తి ఇచ్చాయి. కుటుంబ కథా చిత్రాలు బాగా పేరుతెచ్చాయి. నాడు అగ్రనటులతో నటించాను. నేటి అగ్రనటులకు తల్లి పాత్రలు పోషించాను. 25ఏళ్ల తర్వాత మలయళం సినిమా చేస్తున్నాను. ఏ రోల్‌పడితే అది చేయను.

ప్రస్తుతం రాజకీయాలపై ఇంట్రస్ట్ వుందా?

గతంలో నేను తెలంగాణలో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా చేశాను. ప్రస్తుతం ఏ పార్టీలోనూ లేను. ఈ వయసులో రాజకీయాలకు సూట్ అవుతానా లేదో చూడాలి. ప్రస్తుతానికి ఆ ఆలోచన లేదు. రోల్ అనేది ముఖ్యం. అది ప్రామిస్ చెయ్యలేకపోయినప్పుడు ఉండలేము. రోజూ పని అనేది ఉండాలి. స్మృతిఇరానీలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి.

మీరు సినీ రంగంలోకి రావడానికి ప్రేరణ?

ఇది చిన్నప్పటి విషయం. గూగుల్‌లో కూడా తప్పులు ఉన్నాయి. నేను 12వ ఏట సినీ పరిశ్రమలోకి వచ్చాను. మా ఆంటీ విజయ నిర్మల గారు నన్ను తీసుకువచ్చారు. ఆమె నాకు ప్రేరణ. ఎన్నో సినిమాలు చేశాను. ఆనందంగా ఉంది.

రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి)